తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
14 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## పంద్రాగస్టు వేడుక ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 జనం సాక్షి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 15న సంగారెడ్డిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుండగా, జిల్లా స్థాయిలో నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సలహాదారులు, ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్దిదారులు హాజరు కానున్న దృష్ట్యా, పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలని, ప్రోటోకాల్ ను అనుసరిస్తూ ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా గందరగోళానికి తావు లేకుండా ముందస్తుగానే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ అరేంజ్మెంట్, పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చక్కబెట్టుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు పురమాయించారు. అలాగే, ఈ నెల 15న ఉదయం వేళలో పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న




సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థు లచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సత్కరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వీలుగా సీటింగ్ అరేంజ్మెంట్ చేయాలని అన్నారు.ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తరగతి గది బోధనా పద్ధతులను బలోపేతం చేయలి

**○అకడమిక్ ప్యానల్ సందర్శనలు తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారం అందించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**○ తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్మెంట్, ఆధారాలతో కూడిన ఫీడ్బ్యాక్తో నిరంతర విద్యా అభివృద్ధికి చర్యలు**

**○ ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో అకడమిక్ ప్యానల్ విధానంపై ప్రజెంటేషన్**

పెద్దపల్లి,ఆగస్టు 13(జనంసాక్షి) : అకడమిక్ ప్యానల్ సందర్శనలు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందిస్తూ, పాఠశాలల్లో నిరంతర విద్యా అభివృద్ధికి దోహదపడేలా ఉండాలిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సూచించారు.తరగతి గది బోధనా పద్ధతులను బలోపేతం చేయడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం అకడమిక్ మానిటరింగ్ ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు.గురువారం హైదరాబాద్లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రంలోని అన్ని మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కోసం నిర్వహించిన ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో లిపెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై రాష్ట్రస్థాయి అధికారులకు ప్రజెంటేషన్ ఇచ్చారు.పెద్దపల్లి జిల్లాలో అకడమిక్ ప్యానల్ ద్వారా పాఠశాలలను క్రమబద్ధంగా సందర్శిస్తూ, పాఠశాల స్థాయిలో బోధన--అభ్యసన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రతి పాఠశాల సందర్శనలో తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్మెంట్ తప్పనిసరిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రత్యక్షంగా అంచనా వేసి, అభ్యసనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన జోక్యాలను ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు.



విద్యార్థుల అభ్యసన డేటాను ఆధారంగా చేసుకుని బోధనా ప్రణాళికలను మరింత ప్రభావవంతంగా రూపొందించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు,ప్రాంతీయ సంయుక్త సంచాలకులు,క్వాలిటీ కోఆర్డినేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

# జఫర్ ఖాన్ పేట లో: రూ. 5.43 కోట్లతో మద్దెల వాగు బ్రిడ్జి ప్రారంభం

- ○ గ్రామీణ ప్రజల సౌకర్యార్థం నూతన ఆర్టీసీ బస్సు సేవలు
- ○ గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ○ సుల్తానాబాద్-పెద్దపల్లి-ముత్తారం కనెక్టివిటీకి కోట్ల నిధులు మంజూరు
- ○ మంత్రులతో ఆగస్టు 17న సుల్తానాబాద్లో భారీ శంకుస్థాపనలు
- ○ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణరావు



పెద్దపల్లి,ఆగస్టు 13(జనంసాక్షి) : కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జఫర్ ఖాన్ పేట గ్రామంలో గురువారం రూ. 5.43 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జి మరియు గోదావరిఖని-జఫర్ ఖాన్ పేట-పెద్దపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించిన అనంతరం గ్రామంలో 15 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను స్థానిక అధికారులు మరియు నాయకులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గడప గడపకు తిరిగినప్పుడు రోడ్లు లేక, స్కూల్ భవనాలు శిథిలావస్థలో ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు.ఈరోజు లక్షల రూపాయల నిధులతో పాఠశాల పునర్నిర్మాణం, కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు ఇండ్ల సంఖ్యతో సంబంధం లేకుండా గ్రామంలోని వీధులన్నింటికీ సిసి రోడ్లు పూర్తి చేశామన్నారు. రూ. 5.43 కోట్లతో మద్దెల వాగు బ్రిడ్జి పూర్తి చేయడమే కాకుండా, అప్రోచ్ రోడ్లకు అదనంగా మరో కోటి రూపాయలు ఖర్చు చేసి రవాణా కష్టాలను తీర్చామని తెలిపారు. మిగతా 16లో

# ముస్తఫా నగర్ గ్రామంలో విషాదం..

## ఉరి వేసుకుని గర్భిణి మహిళ మృతి

**గంభీరావుపేట ఆగస్టు 13 జనంసాక్షి;** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొంతల లావణ్య (30), భర్త సురేష్ , గురువారం రోజు సాయంత్రం ఉరివేసుకొని మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.లావణ్య నిండు గర్భిణిగా ఉన్నట్లు సమాచారం. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది, ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



## సిరికొండలో ఘనంగా హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



**సిరికొండ ఆగస్టు 13(జనం సాక్షి ):**సిరికొండ మండలంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ర్యాలీ అంగడి బజారు నుంచి ప్రారంభమై తెలంగాణ చౌరస్తా వరకు కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూని బైక్‌లపై ర్యాలీగా సాగిన నాయకులు, కార్యకర్తలు దారిపొడవునా "వందే మాతరం.. భారత్ మాతాకీ జై.. జై శ్రీరామ్" అంటూ నినాదాలు చేయడంతో సిరికొండ ప్రధాన రహదారులు మారుమోగాయి. మండలంలోని నాలుగు మూలల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ సాగిన ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది. దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయతా భావాన్ని చాటాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్క భారతీయుడు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వామి కావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని, జాతీయతా భావాన్ని చాటాలని కోరారు. జాతీయ జెండా దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, జిల్లా నాయకులు రాజేశ్వర్ రెడ్డి, ప్రభాకర్, తలకట్ల గంగారెడ్డి, బాబురావు, కనుగందుల గోపి, కళ్యాణ్, కార్తీక్, అజయ్, మండల బీజేపీ నాయకులు, వివిధ మోర్చా అధ్యక్షులు,బూత్ అధ్యక్షులు,శక్తి కేంద్ర ఇంచార్జీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై బైక్ ర్యాలీని విజయవంతం చేశారు.

## ఆయిల్ ఫామ్ తోటలను సందర్శించిన ఏ.డి.ఏ



**సదాశివనగర్, ఆగస్టు 13 (జనంసాక్షి):**సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులోని ఆయిల్‌పామ్ తోటలను ఎల్లారెడ్డి ఏ డి ఏ సుధామాధురి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పంట కోతను పరిశీలించి, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు.అనంతరం గ్రామంలోని ఇతర రైతులను సమీకరించి, ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా ప్రోత్సహించారు. ఆయిల్‌పామ్ సాగు విధానం, పంట నిర్వహణ, సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, రైతులకు లభించే ఆదాయం గురించి వివరించారు.అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగుకు అందిస్తున్న రాయితీలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, అడ్లూర్ ఎల్లారెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

## కుర్ధుల్ పేట్ లో  కొత్త ఒరవడికి శ్రీకారం



**సిరికొండ ఆగస్టు 13(జనం సాక్షి )** సిరికొండ మండలం కుర్దుల్ పేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఉప సర్పంచ్ సతీష్ నాయకత్వంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు .వికలాంగులు ,వితంతువులు పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారికి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ముఖ్యంగా వికలాంగులకు ఈ ప్రక్రియలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా నాయకులు చర్యలు చేపడుతున్నారు.అర్హులైన వారు ఎవరూ నష్టపోకుండా ప్రభుత్వ పథకం ప్రయోజనం అందించాలనే ఉద్దేశంతో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తుండటంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా తమ వంతు సహకారం అందిస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## కంది పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



**సదాశివనగర్, ఆగస్టు13 (జనంసాక్షి):** సదాశివనగర్ మండలంలోని ధర్మారావుపేట గ్రామ శివారులో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి గురువారం హీూచ్రూ పథకం కింద సరఫరా చేసిన కంది మినీకిట్ (ఔ=జు+-255) పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా కంది సాగు చేస్తున్న రైతులతో మాట్లాడిన ఆయన, పంట పరిస్థితి, వర్షపాతం ప్రభావం తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా పంట నిర్వహణ చేపట్టాలని రైతులకు సూచించారు.అలాగే పంట దిగుబడిని పెంచేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, చీడపీడల నియంత్రణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడి సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ధర్మారావుపేట ఉప సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి లిఖిత్, రైతులు పాల్గొన్నారు.

## వెలుట్ల గ్రామంలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన



**సదాశివనగర్ ఆగస్టు13 (జనంసాక్షి)** లింగంపేట మండలంలోని వెలుట్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రవికుమార్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రైతులు ఈ యాప్ ద్వారా యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులను సులభంగా బుక్ చేసుకుని పొందవచ్చని తెలిపారు.అలాగే రైతులు ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని వివరించారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం సాగును విస్తృతంగా చేపట్టి, ఖర్చులను తగ్గించుకుంటూ అధిక లాభాలను పొందాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో విద్యార్థులతో దేశభక్తి ర్యాలీ



**అంతర్గాం,ఆగస్టు13(జనంసాక్షి):**పాలకుర్తిమండలం కుక్కలగూడూర్ గ్రామంలో మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ పతాకాలను అందజేసి, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, యువత దేశ సేవలో ముందుండాలని ఆమె అన్నారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతి రాణి అధ్యాపకులు మరియు బిజెపి నాయకులు గోపు రామన్న, మేదం రాజు, శంకరయ్య ,మేదం మల్లయ్య, చల్ల హరీష్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను చాటిన బుద్ధునితో నా ప్రయాణం



**8వ కాలనీ (జనంసాక్షి)ఆగస్టు 13:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, గౌతమ బుద్ధుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ప్రదర్శించిన 'బుద్ధునితో నా ప్రయాణం' రంగస్థల నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం ఎనిమిదవ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో హైదరా బాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నాటకాన్ని ప్రదర్శి ంచారు.కార్యక్రమానికి ఆర్జీ-2 జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంబి ంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, గౌతమ బుద్ధుల ఆశయాలను యువత, మహిళలు, కార్మికులకు చేరవేయడమే ఈ నాటక ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సింగరేణి చైర్మన్ బుద్ధ ప్రకాష్ ఆదేశాల మేరకు సింగరేణి ఏరియాలో 35 నాటక ప్రదర్శనలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు .ఇప్పటికే సింగరేణి ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి', 'సత్యశోధన' నాటకాలు విజయవంతంగా ప్రదర్శించబడ్డాయని తెలిపారు. 22 మంది కళాకారులతో కూడిన నాటక బృందం ఆధునిక లైటింగ్, నేపథ్య సంగీతం, అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుందని అన్నారు. నాటకాన్ని వీక్షించిన ప్రేక్షకులకు సినిమా చూస్తున్న అనుభూతి కలిగిందని పేర్కొన్నారు.నాటక ప్రదర్శనలో కళాకారుల అభినయం, రంగస్థల అలంకరణ, లైటింగ్ ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. అంబేద్కర్ ఆలోచనలు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలను నాటకం ద్వారా ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబశివరావు, అధికార ప్రతినిధి నలివెల్లి వేణుగోపాల్, ఎస్ఓటు జీఎం మాలోతు రాముడు, వకీల్‌పల్లి గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ నెహ్రూ, డీవైపీఎం సునీల్ ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సింగ్ శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ పుట్టపాక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత నిరుపేద కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి



**రాయికల్ ఆగస్టు (జనం సాక్షి)** :రాయికల్ మండలంలోని మహితాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దుమాల రవి (35)నిరుపేద యువకుడు అనారోగ్యానికి గురై జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం రవి ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి గురువారం రోజున ఉదయం మండల మరియు గ్రామ నాయకుల తో కలిసి పరా మర్శించారు. మృతి ని కుటుంబానికి గ్రామంలో ఆయన కుటుంబం నివాసం నివాసించేందుకు కూడ ఇల్లు లేకపోవడంతో వారు గురువారం రోజున గ్రామంలో ఉన్న శ్మశాన వాటిక లోనే కర్మకఖండ లు జరిపించడం వల్ల అక్కడకు చేరుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి వారిని చూసి చలించిపోయారు. వెంటనే వారికి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం మృతి చెందిన కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి అన్నారు. ప్రస్తుతం చేయూత పథకం కింద పెన్షన్ మరణించిన రవి మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకుని వెంటనే చేయూత పథకం కింద వితంతు పింఛను మంజూరు చేయించాలని గ్రామ నాయకులను ఆదేశించారు. మరణించిన రవి భార్య పిల్లలకు ఇంటిని మంజూరు చేయాలని అన్నారు. మరణించిన రవి పిల్లలకు విద్యకు ఎలాంటి అవసరం ఉన్న తోడుగా నిలుస్తాను అన్నారు.వారి వెంట. రాయికల్ మున్సిప ల్ చైర్మన్ కటుకం రవీందర్. మాజీ జడ్పిటిసి సభ్యులు గోపి మాధవి రాజారెడ్డి రాయికల్ మండల బి అర్ ఎస్. పార్టీ అధ్యక్షుడు బర్కం మల్లేశం రాయికల్ పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్ మహితాపూర్ మాజీ యంపిటిసి గోపి రాజారెడ్డి మహితాపూర్. రామోజీ పేట గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ లు దొంగ ప్రణయ్ రెడ్డి ఇద్దశీ సుధీర్ రెడ్డి గ్రామ వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య అనుమల్ల రమ సత్యనారాయణ నెమిళ్ల లత స్వామి రెడ్డి మండల గ్రామ నాయకులు కొయ్యడి మహిపాల్. మంద రమేష్ జకిలేటి హరీష్ రావు. కడుతల లక్ష్మీనారాయణ ఎనగంటి రవి. కొల్ల బుచ్చి రెడ్డి వేణు గోపాల్ లంక దాసరి తిరుపతి. గంగుల శ్రీనివాస్ అనుమల్ల సత్యనారాయణ. శ్రీనివాస్ సంబ గంగాధర్. మిట్టపల్లి రామన్న తురగ నారాయణ రెడ్డి మ్యాకల రాజేశం లింగారెడ్డి. నందన. బొమ్మన సూరత్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**రాయికల్ ఆగస్టు13 జనం సాక్షి** :రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ ఈ సందర్భంగా అల్లిపూర్ విద్యార్థులు ఇటీవల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మరియు యోగ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలతో పాటు చదువు క్రమశిక్షణ చాలా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంబారీ గౌతమి వెంకటేష్ , ఉప సర్పంచ్ వినయ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ యం.ఏ ముఖీద్, వార్డ్ సభ్యులు, గ్రామస్థులు ఉపాధ్యాయులు అభినందించారు

# గన్నేరువరంలో వింతమనిషి పొడవున్న భారీ సొరకాయ



**గన్నేరువరం, ఆగస్టు 13 (జనంసాక్షి)**:గన్నేరువరం గ్రామానికి చెందిన బోయిని అంజయ్య ఇంటి వద్ద ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. ఆయన తన ఇంట్లో ఉత్సాహంగా పెంచుకుంటున్న సొరకాయ చెట్టుకు ఒకేసారి అతిపెద్ద సొరకాయ కాయడం స్థానికంగా అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. సాధారణంగా సొరకాయలు నిర్ణీత పరిమాణంలో ఉంటాయి. కానీ, ఈ చెట్టుకు కాసిన ఒక సొరకాయ మాత్రం సుమారు మనిషి పొడవు (సుమారు 5 నుంచి 6 అడుగుల వరకు) ఉండటం గమనార్హం. ప్రత్యేకించి, ఈ భారీ కాయ ఇంకా లేత దశలోనే ఉండటం మరింత విశేషం.ఈ వింత సొరకాయను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పొరుగువార్లు అంజయ్య ఇంటికి భారీగా తరలివస్తున్నారు. ప్రకృతి వింతగా భావిస్తూ ఆశ్చర్యపోతున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా, కేవలం సహజ పద్ధతులలో పెంచిన ఈ చెట్టుకు ఇటువంటి భారీ కాయ కాయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ అరుదైన సొరకాయను చూసేందుకు వచ్చే వారు సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలోనూ షేర్ చేస్తున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్



**సైదాపూర్ ఆగస్టు 13( జనం సాక్షి)** సైదాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను (గ్రానజ) సైదాపూర్ గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న - సంతోష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని వివిధ పరికరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, డాక్టర్లు మరియు సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశు భ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు.గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రుల పాత్ర కీలకమని, ఎవరికీ ఎలాంటి వైద్య సాయం కావాలన్నా ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని సర్పంచ్ స్వప్న - సంతోష్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపగోని నవీన్,వార్డ్ సభ్యులు వంగ తిరుమలేష్, పొడిశెట్టి అజయ్, మునిగంటి రాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రైమరీ పాఠశాలలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జన్మదిన వేడుకలు



**గోదావరిఖని,ఆగస్టు13 జనంసాక్షి** :కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ జన్మదిన వేడుకలు మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, హనుమాన్ నగర్ నిర్వహించారు.కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలందరికీ ఉచిత వాటర్ బాటిల్స్(స్టీల్ వాటర్ బాటిల్స్) అందించారు. ముఖ్య అతిథి మనాలి ఠాకూర్ హాజరై కేక్ కట్ చేసి పిల్లలకు ఆ ఉచిత బాటిల్స్ అందించారు. దాంతో పిల్లలు ఎంతో సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బొంతల రాజేష్, కాల్వ లింగ స్వామి, ఎం. రవి కుమార్, నాయిని ఓదెలు, కార్పొరేటర్లు నెలకంటి రాము, యుగంధర్, మాదాసు శ్రీనివాస్, ముప్పె రవి కుమార్, సీనియర్ న్యాయవాది చక్రపాణి, వేల్పుల అరుణ్ కుమార్, కాదాషి శేఖర్, షానవాజ్ ఖాన్, జి. విజయ్, స్కూల్ స్టాఫ్ సుభాష్ , ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో



**గోదావరిఖని ,ఆగస్టు13 జనంసాక్షి** :రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా , ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఆమోఘమని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ , ఔట్ సోర్స్ కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కార్యాలయంలో ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తమ పాలక వర్గం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం నుండి వారికి అందవల్సిన ప్రయోజనాలను సకాలంలో వచ్చేట్టు చూస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఒక్కొకరికి రెండు జతల దుస్తులు , రెండు తువ్వాలలు సుమారు 400 మంది సిబ్బందికి అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ , సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్ , జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)అగస్ట్ 13:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు ఈనెల 16న పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గణపతి తెలిపారు. ఏపీజే అబ్దుల్ కలాం మైదానంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.అర్హులైన క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఫుట్‌బాల్ కిట్‌తో హాజరు కావాలని ఆయన సూచించారు.

## హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

**వీణవంక ఆగస్టు13(జనం సాక్షి)** వీణవంక ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వీణవంక మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ రమేష్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.గురువారం రోజున ఈ సందర్భంగా హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షులు పిల్లి రవి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ హమాలి కార్మికులు అనేక సంవత్సరాల నుండి బస్తాలు ఎగుమతులు దిగుమతులు చేస్తూ పనిచేస్తున్నారు.కానీ వారికి ఎలాంటి బెనిఫిట్స్ ప్రభుత్వం నుండి రావరావడ లేదు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నది ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినటువంటి హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తదితర సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.కానీ ఇంతవరకు ఎలాంటి సమస్యలు



పరిష్కరించలేదు హమాలి కార్మికులు ఎగుమతులు దిగుమతులు బస్తాలను సరుకులను ప్రజలకు ప్రభుత్వానికి ఎంతో పని చేస్తున్నారు కావున ఇట్టి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి సంక్షేమ పథకాలు అమలు చేయాలి హమాలి కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలి.ప్రభుత్వం కార్మికులందరికీ 55 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 6000 రూపాయలు పింఛను ఇవ్వాలి ఇండ్లు లేని హమాలీ కార్మికుల అందరికీ ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి 120 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలి ప్రభుత్వం నేరుగా గుర్తింపు కార్డులు అందించాలి.ప్రమాదంలో మరణించిన హమాలి కార్మికులకు 25 లక్షల రూపాయలు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.లేనియెడల హమాలి కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ మండల అధ్యక్షులు గుంపుల సంపత్,హమాలి మండల ప్రధాన కార్యదర్శి తడిగొప్పుల రాజయ్య,ఎలవేని కుమార్,పోల్ వినయ్,సాల్మన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెంటనే యూనిఫాంలు పంపిణీ చేయాలి

**సిరిసిల్ల టౌన్ ఆగస్టు 13 (జనం సాక్షి)**రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేయకపోవడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు పాత యూనిఫాంలతో లేదా సాధారణ దుస్తులతో పాఠశాలలకు హాజరవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక సౌకర్యాలు, యూనిఫాంలను సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ, విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తవుతున్నా యూనిఫాంలు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.యూనిఫాంల పంపిణీలో జరిగిన



జాప్యం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు విద్యార్థుల ఆత్మవిశ్వాసం కూడా దెబ్బతింటోందని తెలిపారు.అందువల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన స్కూల్ యూనిఫాంలను తక్షణమే పంపిణీ చేయాలని, ఈ జాప్యానికి కారణమైన సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. అలాగే విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్,బల్యాల ప్రవీణ్,కోడం వెంకటేశం, గాజుల రిషిత్, స్వాతి, శ్రీకర్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని వెంటనే తెరవాలి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 జనం సాక్షి:నిజామాబాద్ జిల్లా సారంగాపూర్‌లో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించి, రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వమే నిర్వహించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. గురువారం సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనానికి సుమారు 180 మంది రైతు సంఘం నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా లిసమావేశానికి అధ్యక్షత వహించిన ఆకుల పాపయ్యలి మాట్లాడుతూ, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ ఈ ప్రాంతంలోని వేలాది మంది రైతులు, కార్మికులకు దశాబ్దాలుగా జీవనాధారంగా నిలిచిందన్నారు. 1964లో రైతుల వాటాలతో, ప్రభుత్వ సహకారంతో ఏర్పాటైన ఈ ఫ్యాక్టరీని 2008లో మూసివేయడంతో రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఫ్యాక్టరీ మూతపడిన తర్వాత చెరకు సాగు తగ్గిపోయిందని, రైతులు తమ పంటను ఇతర పంట వరి సాగు చేస్తున్నారని వారు అన్నారు.ఫ్యాక్టరీకి గతంలో





23,143 మంది రైతులు సభ్యులుగా ఉండగా, ప్రతి సంవత్సరం సుమారు 5 నుంచి 6 వేల మంది రైతులు చెరకును సరఫరా చేసేవారని, ఫ్యాక్టరీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి పైగా ఉపాధి లభించేదని ఆకుల పాపయ్య తెలిపారు. రైతుల వాటాలతో ఏర్పడిన పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం కాకుండా ప్రభుత్వమే నిధులు కేటాయించి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం రైతులు మళ్లీ చెరకు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం ఫ్యాక్టరీని పునఃప్రారంభించి చెరకు కొనుగోలుకు హామీ ఇస్తే ఈ ప్రాంతంలో చెరకు సాగు తిరిగి పుంజుకుంటుందని అన్నారు ్ు.ప్రభుత్వం ఇకనైనా ఆలస్యం చేయకుండా ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే రైతులను సమీకరించి వందలాది ట్రాక్టర్లతో “చలో నిజామాబాద్” కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనాధారమైన ఫ్యాక్టరీ కోసం జరిగే పోరాటానికి అందరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.దీఖూ అధ్యక్షులు కొండేలా సాయిరెడ్డి మాట్లాడుతూ, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఫ్యాక్టరీ తెరవడానికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.నాయకులు తెలిపారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వ ఆధ్వర్యంలో వెంటనే పునఃప్రారంభించే వరకు రైతులు, కార్మికులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**కరీంనగర్‌టౌన్,ఆగస్టు13,(జనం సాక్షి)**పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి సీపీటీసీకి తరలించారు.ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల నుంచి కళాశాలల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు.విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేకపోవడంతో సమస్యలు మరింత తీవ్రతరమవుతున్నాయని, వెంటనే విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు అందించకపోవడంపై




ప్రశ్నించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉదయం టిఫిన్ పథకాలను అమలు చేయాలని కోరారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ సైన్స్ కళాశాలలో తరగతి గదుల కొరతను పరిష్కరించి నూతన భవనం నిర్మించాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, గర్ల్స్ కన్వీనర్ మానస, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజన, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ అండర్ బ్రిడ్జ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు శ్రీకారం

**జమ్మికుంట,ఆగస్టు 13 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట మండలంలో దక్షిణ మధ్య రైల్వే సంస్థ వారు రైల్వే లైన్ విస్తరణ అభివృద్ధి పనులలో భాగంగా లెవల్ క్రాసింగ్ లైన్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్,రోడ్డు అండర్ బ్రిడ్జి,ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లను ఏర్పాటు చేయుటకు శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగా కాజీపేట - బల్లహ్షా సెక్షన్ ల మధ్య ఎల్ సి.20 కి.మీ 332/28-20 జమ్మికుంట - మడిపల్లి క్రాస్ ం ఎల్ సి 25, కి.మీ..323/12-14 పాపయ్యపల్లి గ్రామాలలో రోడ్డు,ఓవర్ బ్రిడ్జి (=ాదీ) ఎల్జిన్మెంట్ కొరకు జాయింట్ ఇన్స్పెక్షన్ చేశారు.దీనికి సంబందించిన ఆయా డిపార్ట్మెంట్స్ అధికారులకు రెండు గ్రామాల పెద్దలు, రైతులకు అలైన్మెంట్ గురించి వివరించారు. అలాగే ప్రజల సలహాలు,సూచనలు తీసుకున్నారు.



ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సురేందర్,రోడ్ సెక్టార్ ప్రా6జెక్టు రైల్వే భూ సేకరణ నిపుణులు పి దేవరాజు,రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎన్.జలకుమారి,జమ్మికుంట తహసిల్దార్ జి. సుధాకర్, ఆర్ ఐ జి. శంకరయ్య ,ఎన్ సత్యనారాయణ,ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ డిపార్ట్మెంట్ అధికారులు, పాపయ్యపల్లి గ్రామ సర్పంచ్ , జి పి ఓ లు శ్రవణ్ ప్రతాపరాజు, రైతులు,పంచాయతీ కార్యదర్శి లు తదితరులు పాల్గొన్నారు.

# కాలేజీల ఫైర్ నిబంధనలు పాటించకున్నా ఎన్ఓసీలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 13 ( జనం సాక్షి)**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా అనే దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని కాలేజీలకు ఫైర్ ఎన్ఓసీలు ఎలా జారీ చేస్తున్నారో అధికారులు వెల్లడించాలని కోరారు.గురువారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే తనిఖీల పేరుతో కొందరు అధికారులు ప్రైవేట్ కాలేజీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపించారు. కనీస వసతులు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు లేని విద్యాసంస్థలకు కూడా నామమాత్రపు తనిఖీలతో ఎన్ఓసీలు, ఇతర ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారని అన్నారు. ఒక్క భవనానికి ఫైర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు లేకుండానే అనువ ంతులు ఇస్తున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. నామమాత్రపు తనిఖీలపై ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 1,400 ప్రైవేట్ కాలేజీలు అఫిలియేషన్




కోసం దరఖాస్తు చేసుకున్నాయని శేఖర్ తెలిపారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో డీఐఈఓలు నిర్వహించిన ఫిజికల్ వెరిఫికేషన్ నివేదికలను పరిశీలించిన సమయంలో పలు లోపాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఖాళీ గదులను ల్యాబ్‌లు, లైబ్రరీలుగా చూపించడం, కనీస మరుగుదొడ్లు లేని కాలేజీలకు సైతం అనుకూల నివేదికలు ఇవ్వడం వంటి అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మే నెలలో పూర్తికావాల్సిన అఫిలియేషన్ ప్రక్రియ ఆగస్టు వచ్చినా పూర్తి కాకపోవడానికి అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణమా అనే కోణంలో పరిశీలి ంచాలన్నారు.కరీంనగర్ డీఐఈఓ కార్యాలయంలో కొందరు అధికారులు దీర్ఘకాలంగా ఒకే చోట కొనసాగుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫైర్ సర్వీసెస్ అధికారులు, విద్యాశాఖలోని కొందరు సిబ్బంది కలిసి కాలేజీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ అవసరమన్నారు.విద్యార్థుల భద్రతకు సంబం ధించిన అంశాల్లో రాజీ పడితే భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని బండారి శేఖర్ హెచ్చరించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్న, పాటించని కాలేజీల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫైర్ అధికారులు, డీఐఈఓ కార్యాలయ సిబ్బందిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్లకు సంబంధించిన ఆధారాలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేయనున్నట్లు బండారి శేఖర్ తెలిపారు.

# కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులకు పొలం పనులపై అవగాహన



**రుద్రంగి ఆగస్టు 13 (జనం సాక్షి)**రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన ఏడవ, ఎనిమిదవ తరగతి విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా స్థానిక రైతుల వద్దకు వెళ్లి వ్యవసాయ సాగు విధానాలు, పంటల సాగులో ఎదురయ్యే సమస్యలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా పొలంలోకి దిగి వరి నారు వేశారు. రైతులు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకుని, వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకున్నారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజ్ మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముక అయిన రైతుకు గౌరవం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. “అన్నం పరబ్రహ్మ స్వరూపం” అని అంటారని, అలాంటి అన్నాన్ని అందించే రైతు ఆ బ్రహ్మకన్నా గొప్పవాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు జీవితంలో క్రీడలు ముఖ్యపాత్ర ఎస్సై జ్యోతి



**ముస్తాబాద ఆగస్టు 13( జనం సాక్షి)**ముస్తాబాద్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జీవితంలో క్రీడల యొక్క ప్రాముఖ్యత ఆంటీడ్రగ్స్ పైన అవగాహన కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోగురుకుల పాఠశాల విద్యార్థులకు 30000 రూపాయల విలువ గల స్పోర్ట్స్ కిట్ లను గూడెం గ్రామానికి చెందిన చిట్టీనేని మాధవి -వేంకటేశ్వర్ రావు డొనేట్ చేయడం జరిగింది. స్పోర్ట్స్ కిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్తాబాద్ గ్రామ సర్పంచ్ మట్ట వేంకటేశ్వర్ రెడ్డి ఎస్సై జ్యోతి , విద్యార్థులకు క్రమశిక్షణ, క్రీడలు, చదువు విలువ మరియు ఆంటీడ్రగ్స్ పైన అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ముస్తాబాద్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు నరేష్, పార్టీ మండల అధ్యక్షులు సురేందర్ రావు, పట్టణ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ముస్తాబాద్ మండల మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ , చిప్పల పల్లి గ్రామానికి చెందిన కొమ్మట రాజమల్లు , పాల్గొన్నారు. పాఠశాలకు అవసరమైన క్రీడా సామాగ్రిని అందించిన చిట్టినేని వెంకటేశ్వరరావు గారికి ఈ.కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ధన్యవాదములు తెలియజేశారు.

## నూతన తాగు నీటి బోరు ప్రారంభం



**మల్లాపూర్, ఆగస్టు13 (జనంసాక్షి)** మండల కేంద్రం లోని ఒడ్డెర కాలనీ లో డిపెప్ పాఠశాల లో తాగునీటి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ అధ్యక్షులు జువ్వాడి నరసింగరావు సహకారం తో గ్రామ పంచాయతీ పాలకవర్గం నూతన తాగునీటి బోరును ప్రారంభించింది.ఈ కార్యక్రమం లో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మరియు పాలకవర్గం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల లో నీటి ఇబ్బందులు తొలగిపోతాయని, విద్యార్థులకు,ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుందని,వేసవి కాలంలో తలెత్తే త్రాగునీటి ఎద్దడిని ముందస్తుగా నివారించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి,వార్డు సభ్యులు ముప్పురి రమేష్,అరికుప్పల రాజం,ముత్యాల గంగా రాజం,శనిగారపు లావణ్య –నరేష్,సామాజిక కార్యకర్త ఏ.వీ.ఆర్ ఒడ్డెర కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## చిట్టాపూర్ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



**మల్లాపూర్ ఆగస్టు13 (జనం సాక్షి)**మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంపతి శంకరమ్మ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు చిన్నారులకు పునాది లాంటివని వారి అక్షరాభ్యాసం ఇక్కడి నుండే ప్రారంభమైతుందని అన్నారు. అలాగే చిన్నారులకు గర్భిణులకు పోషణ ఆహార పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాల్సాని ప్రణయ్ గౌడ్, అంగన్వాడి టీచర్లు, హెల్త్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు

### ప్రాణం కాపాడిన యువకులను సన్మానించిన ఏసీపీ




మంథని, ఆగస్టు 13, ( జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మం థని మున్సిపల్ పరిధి లోని బోయిన్ పేట్ బొక్కల వాగులో గొర్రెల కాపరి అయినా పర్వవేన రాజు గొర్రెలను తరలి స్తున్న క్రమ ం లో ప్రమా దవశాత్తు జరిగిన ప్రమాదం లో రాజు మరణించగా వారి కూతురు కూడా మునిగిపోతున్న క్రమంలో అక్కడే ఉన్న అంకం శేఖర్, ఆకుల అరవింద్ అనే ఇద్దరు యువకులు వారి ప్రాణాలకు తెగించి వాగులో దుకి ఆ అమ్మాయిని ఒడ్డుకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడిన ఇద్దరిని గురువారం వారి కార్యాలయంలో ఏసీపీ మడత రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంథని సిఐ స్వామి, ఎస్ఐ తో పాటు మత్స్యశాఖ అధ్యక్షులు పోతరవేని క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

# ప్రజాసేవకు కేంద్రంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం



**ఆర్మూర్,ఆగస్టు 13(జనంసాక్షి):**పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు వివిధ తీవ్రతరమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి శస్త్రచికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుంది.అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వివాదాలకు అతీతంగా కులమత ప్రాంత బేధం లేకుండా అందుతుంది.ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నియోజకవర్గం స్థాయి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ లో ప్రత్యేక చొరవ చూపుతూ సేవలను అందిస్తుంది.రోజువారీగా నందిపేట్,మాక్లూర్, ఆలూరు ,డొంకేశ్వర్,ఆర్మూర్ మండలాల నుండి బాధిత కుటుంబాలు తరలివచ్చి సీఎం సహాయనిధిని కోరుతున్నారు.సుమారుగా బాధితుల కుటుంబాల సంఖ్య రోజువారిగా 20 నుండి 25 మంది పత్రాలతో కార్యాలయాన్ని చేరుకుంటున్నారు.ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన ఎటువంటి తప్పిదాలు జరిగిన వాటిని బాధిత కుటుంబాలకు సర్ది చెప్పుతూ హాస్పిటల్ తో నేరుగా మాట్లాడి తప్పు ఒప్పులను సరిదిద్దుతున్నారు.సుదూర ప్రాంతాల నుండి వస్తున్న చదువురాని వారిని సైతం ఆదరించి త్రాగునీరు,టీ అందించి ఓపికగా పత్రాలను పరిశీలిస్తూ సహాయనిధి మంజూరయ్యేలా చేస్తున్నారు. లబ్ధిదారులకు అందిన నిధులు ఇవేఆర్మూర్ బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారు.ఎమ్మెల్యేగా ముఖ్య మంత్రిని,మంత్రులను కలుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా ఉండి అసెంబ్లీలో తన గళాన్ని విప్పుతూ నిధులు,నియామకాలు,అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రెండున్నర ఏళ్ల కాలంలో నియోజకవర్గంలోని సుమారు 6650 మంది లబ్ధిదారులకు రూ.16 కోట్ల 88 లక్షలు మంజూరు చేయించి పేదలకు పంచారు.నిరుపేదలకు అత్యవసరమైన వారి ప్రాణాలను నిలిపేందుకు బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు.నియోజకవర్గ ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడంలో వారి కృషి అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.



# గర్శకుర్తిని మండలంగా చేయడానికి కట్టుబడి ఉన్నాను



**గంగాధర ఆగస్టు13 (జనంసాక్షి):**మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండలంగా చేయడానికి కట్టుబడి ఉన్నానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.గురువారం గర్శకుర్తి గ్రామస్తులు గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు.ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కట్టుబడి ఉన్నానని గ్రామస్తులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు అసెంబ్లీలో తీర్మానం చేసిన సమయంలో తప్పకుండా గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని గర్శకుర్తి గ్రామాన్ని చేనేత హబ్ గా చేయడానికి సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గర్శకుర్తి గ్రామానికి ఆహ్వానించి ఇక్కడి చేనేత కార్మికులకు మరింత ఆర్థిక చేయూత నివ్వడానికి కృషి చేస్తానని గ్రామస్తులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహే ందర్,గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు,వార్డు సభ్యులు మామిడి అఖిల్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ రాజేశం,చిప్ప చక్రపాణి,దూస రాజమౌ ళి,అన్నాల్ దాస్ శ్రీనివాస్,కొలిపాక రాజు,మల్లికార్జున్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్మక్కపల్లి లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**వీణవంక ఆగస్టు 13 (జనం సాక్షి)** వీణవంక మండలంలోని లస్మక్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి గ్రామ కాంగ్రెస్ కమిటీని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది.గ్రామ శాఖ అధ్యక్షులుగా గోపు వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా దాసరపు లిఖిల్ లు ఏకగ్రీవ ఎన్నిక కావడం జరిగింది.మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే భర్తీ చేస్తామని మండల నాయకులు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి,మండల సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్,నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి,కొమ్మిడి రాకేష్ రెడ్డి,మేకల ఎల్లారెడ్డి,జిల్లా కార్యదర్శి కంకణాల జగదీశ్వర్ రెడ్డి,ఉప సర్పంచ్ దసారపు శ్రీనివాస్,జున్నుతుల మధుకర్ రెడ్డి,డైరెక్టర్ శ్రీపతి రెడ్డి,పల్లెర్ల కిరణ్,ఇస్సాక్,వార్డు సభ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాలుగొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యం



**రాయికల్ ఆగస్టు 13(జనం సాక్షి:)**ప్రతి సోమవారం రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను వారి వద్దనే తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని వికేంద్రీకృత పద్ధతిలో నిర్వహించేందుకు నిర్ణయించింది.ప్రభుత్వం జారీ చేసినతేదీ: 04.08.2026 మేరకు, ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది.ఈ ప్రజావాణి కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను సంబంధిత మండల స్థాయి అధికారుల దృష్టికి నేరుగా తీసుకురావచ్చు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టి, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను స్వీకరించనున్నారు.ప్రజలకు విజ్ఞప్తిరాయికల్ మండల ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులతో ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి హాజరై ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

# గోవిందపేట్ బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 13 జనం సాక్షి** :తీర్థయాత్రకు బయలుదేరిన భక్తులకు ఆర్మూర్ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై టైర్ పంచర్ కావడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్ట్ బస్సుల్లో తీర్థయాత్రకు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి చేరుకున్న సమయంలో ముందుగా వెళ్తున్న టూరిస్ట్ బస్సు ు+ టైర్ పంచర్ కావడంతో బస్సులను జాతీయ రహదారిపై నిలిపివేశారు.టైర్ పంచర్ కావడంతో బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ డ్రైవర్ ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును సకాలంలో గుర్తించకపోవడంతో బస్సును బలంగా ఢీకొట్టాడు. లారీ ఢీకొట్టడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సు ముందుకు కదిలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుజాత ( 54 ) మాధవి ( 47 ) అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులు సునీత , చిటక్క లకు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. .ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ఇతర ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబదీ ్ధకరించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ఘటన సమాచారం అందుకున్న లినిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా వాహనంలోని ప్రయాణికులు రహదారిపైకి వచ్చి డివైడర్లు లేదా రహదారి పక్కన కూర్చోవడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు.వాహనం ఆగిపోయిన వెంటనే ప్రమాద హెచ్చరిక లైట్లు ఆన్ చేయడంతో పాటు, తగిన దూరంలో రిఫ్లెక్టివ్ వార్నింగ్ ట్రయాంగిల్స్ లేదా ఇతర హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రయాణికులు కూడా రహదారిపై కాకుండా సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి లారీ డ్రైవర్ నిర్లక్ష్యం అతివేగం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఈ సందర్భంగా ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ , ఆర్మూర్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ కుమార్ ఆర్మూర్ జక్రాన్ పల్లి బాల్కొండ ఎస్సైలు మరియు అసిస్టెంట్ ఎం.వి.ఐ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రపంచంలోనే లయన్స్ క్లబ్ రోటరీ క్లబ్ అత్యంత ప్రాచీన సంస్థలు



**రాయికల్ ఆగస్టు13జనం సాక్షి** :రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిష్టంపేట మాజీ సర్పంచ్ తంగెళ్ల రమేష్ తండ్రి స్మారకార్థం అల్లిపూర్ పరిసర గ్రామాల సౌకర్యం కోసం బాడీ ఫ్రీజర్ ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ చేతుల మీదుగా గ్రామాల అవసరాల కోసం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రపంచంలోనే లయన్స్ క్లబ్ రోటరీ క్లబ్ అత్యంత ప్రాచీన సంస్థలు. సామాజిక సేవ ద్వారానే ప్రజల్లో గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వాలే ప్రజలకు అన్నీ చేయలేవని స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు . అత్యంత ధనిక దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు సేవలు అందిస్తున్నాయని అన్నారు . భారతదేశం పేద దేశమని స్వచ్ఛంద సంస్థల పాత్ర ఇక్కడ అత్యంత ఆవశ్యకం అని అన్నారు. ప్రతి ఒక్కరు వారి సంపాదనలో కొంత భాగం సేవ కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,సర్పంచ్ గౌతమి వెంకటేష్, పాక్స్ చైర్మెన్ రాజలింగం,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రావు,లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి యం ఏ ముఖీధ్,జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేందర్ నాయక్,మాజీ ఉప సర్పంచ్ సాగర్ రావు,గ్రామ మండల నాయకులు,సర్పంచులు,అధికారులు ,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత జౌళిశాఖ ఏడీకి పట్టు చేనేత సహకార సంఘం వినతి



ఆర్మూర్,ఆగస్టు 13(జనంసాక్షి):ఆర్మూర్ పట్టు చేనేత సహకార సంఘం పాలకవర్గం సిద్దిపేటలోని చేనేత, జౌళిశాఖ ఏడి బిచ్చప్పను మర్యాద పూర్వకంగా కలిసి ఐడి కార్డులు ఇప్పించాలని గురువారం వినతి పత్రం అందజేశారు.ఆర్మూర్ పట్టు చేనేత సహకారం సంఘం పాలకవర్గం చేనేత,జౌళి శాఖ కార్యాలయంలో ఏడి,సంబంధిత సంబంధిత అధికారులకు పట్టు శాలువాతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు గంగా మోహన్ చక్రు మాట్లాడుతూ ఆర్మూర్ పట్టు చేనేత కార్మికులకు ఐడి కార్డులు లేనందున ఐడి కార్డులు ఇచ్చి చేయూత పథకం ద్వారా ప్రభుత్వం నుండి వచ్చే చేనేత కార్మికుల పెన్షన్ ఇప్పించేందుకు సహకరించాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పట్టు చేనేత కార్మికులకు అందేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు షికారి శ్రీనివాస్, డైరెక్టర్లు పడాల్ నరేందర్,పడాల్ గణేష్,పొహార్ శైలేష్, ఖాందేష్ సత్యనారాయణ,ఆఫీసు ఇంచార్జ్ కర్తన్ గణేశ్యాం పాల్గొన్నారు

## కన్నుల పండుగగా హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



**ఇల్లంతకుంట జూలై 13(జనంసాక్షి** )గురువారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట ఉపసర్పంచ్ మూగు రాజు శర్మ పంతులు జండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలొ పెద్ద ఎత్తున ఇల్లంతకుంట మండల ప్రజలు పాల్గొనడం జరిగింది. దేశంలోని ప్రజలకు హక్కులు ఎలాగైతే ఉన్నాయో హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయని భారత రాజ్యాంగాన్ని,జాతీయ పతాకాన్ని,జాతీయ గీతాన్ని గౌరవించాలన్న భావన ప్రతి పౌరుడిలో రావాలని దేశం కోసం సరిహద్దులలో ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పోరాడుతున్న ఒక జవాను వలె ప్రతి పౌరుడు మారాలని నేడు త్రివర్ణ పతాక బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మండల యువకులు,ప్రజలు, దేశభక్తులు, పాల్గొనడం జరిగింది

# కన్నుల పండుగగా కొనసాగిన తిరంగా ర్యాలీ





కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13( జనం సాక్షి)కామారెడ్డి జిల్లా కేంద్రంలో దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించే ఉద్దేశంతో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న సందర్భంగా, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణారెడ్డి నాయకత్వంలో గాంధీగంజ్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ పట్టణంలోని జీూచీ రోడ్, సుభాష్ రోడ్, తిలక్ రోడ్, సిరిసిల్ల రోడ్, స్టేషన్ రోడ్, కమాన్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు సాగింది. త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతుండగా, దేశభక్తి నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి.ఈ మహా ర్యాలీలో పట్టణంలోని వ్యాపారులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు. అనంతరం నిజాంసాగర్ చౌరస్తాలో జాతీయ గీతం ‘జనగణమన’ ఆలాపనతో ర్యాలీ ముగిసింది. ప్రజల్లో దేశభక్తి భావనను, జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేసేలా తిరంగా ర్యాలీ కన్నుల పండుగగా సాగింది.

## బండారుపల్లి పెద్దమావంది గ్రామాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**బోధన్, ఆగస్టు 13 ( జనంసాక్షి ) :** బోధన్ మండలం బండారుపల్లి, పెద్ద మావంది గ్రామాలలో గురువారం ఐసిడిఎస్ పరిధిలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బండారుపల్లి, పెద్ద మావంది గ్రామాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ గోపిలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జాతీయ జెండా పట్ల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ చాటాలని పిలుపునిచ్చారు. దేశభక్తి అనేది కేవలం జెండాను ఎగురవేయడంతో మాత్రమే కాకుండా, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించడంలో ఉందని తెలిపారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ ఐక్యత మరియు బాధ్యతాయుత పౌరసత్వ భావనలను పెంపొందించాలని, ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి గ్రామ సర్పంచ్ కాడి సాయిలు, పంచాయతీ కార్యదర్శి అర్చన, పెద్దమావంది సర్పంచ్ శకుంతల, కార్యదర్శి హరిత, పంచాయతీ అధికారులు, వీవో సభ్యులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు మరియు గ్రామ సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ప్రాధాన్యత, దేశభక్తి, జాతీయ ఐక్యత మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలపై విద్యార్థులు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

## నెలలు గడుస్తున్నా పత్తాలేని శంకుస్థాపన



**గన్నేరువరం, ఆగస్టు 13 (జనంసాక్షి):**రూ. 77 కోట్లు మంజూరైనప్పటికీ అధికారులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడంలో ఆలస్యం వహిస్తున్నారు. గన్నేరువరం నుండి ఎలగందుల మార్గంలో లోయర్ మానేరు డ్యాం మీదుగా హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల మేరకు కేంద్ర ప్రభుత్వం సి ఆర్ ఎఫ్ఐ స్కీం కింద రూ. 77 కోట్ల భారీ నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా, ఇంతవరకు శంకుస్థాపన చేయకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ వహించకపోవడంతో పనులు కాగితాలకే పరిమితమయ్యాయని గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మూడు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి తమ రవాణా కష్టాలను తీర్చాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర



**ఇలంతకుంట జూలై 13(జనంసాక్షి )**గురువారం రోజున సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మంద అనిల్ కుమార్, సావనపెల్లి మల్లేశం ఆధ్వర్యంలో పొత్తూర్ బ్రిడ్జ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రజా చైతన్య ప్రచార పాదయాత్ర నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద సుదర్శన్ మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్త రాజకీయ ప్రచారం పాదయాత్రలకు సిపిఐ పిలుపునిచ్చింది. ఈ పాదయాత్రలు 2026 సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరగబోయే "బద్లావ్ జరూరీ హై" ( మార్పు అత్యవసరం) ర్యాలీలతో ముగుస్తాయి.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలను సెప్టెంబర్ 1న మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలి. సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి. అలాగే పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత కల్పించాలి. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలి. మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. బ్యాలెట్ పేపరు పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి అలాగే దళిత ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలి. మహిళలలకు రక్షణ కల్పించాలని నేడు భారతదేశంలో ఒక కీలకమైన మలుపులో నిలిచి ఉంది నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ దశబ్దం క్రమంగా ఆందోళన, పెరుగుతున్న కష్టాలకు దారి తీసింది. ఎన్నికల సందర్భంగా బిజెపి అభివృద్ధి ఉపాధి సంక్షేమం సుపరిపాలన మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసింది. కానీ దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం భరించలేనీ ద్రవ్యోల్బణం ధరల పరుగుదల విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోతున్న మోదీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరినప్పుడల్లా ఈ చర్చను ఇతర అంశాల వైపునకు మళ్లిస్తున్నారు. సామాన్య ప్రజలకు అన్యాయం చేస్తున్నారు మత విద్వేషాలతో యువతను ప్రజలను పక్కదారి పట్టిస్తూ కాలం గడుపుతున్న పరిస్థితి ఉందన్నారు. అలాగే భారత రాజ్యాంగాన్ని మార్చడం కొరకు మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు భూంపెల్లి భూమిరెడ్డి, కాదురు మొండయ్య, పెండెల అధిత్య, గుంటి బక్కయ్య, గుంటి తిరుపతి, రాజయ్య, దొమ్మరి కనకయ్య, కోల వెంకటయ్య, గొట్లముక్కుల రాజయ్య, చిగుర్ల అనీల్, తోట్ల రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఆర్‌లో పరిశోధన పద్ధతులపై కార్యశాల ముగింపు



**కరీంనగర్‌టౌన్, ఆగస్టు13, (జనంసాక్షి)**కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన పద్ధతులపై నిర్వహించిన రెండు రోజుల కార్యశాల ముగిసింది. శాతవాహన విశ్వ విద్యాలయం అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా యూనివర్సిటీ కామర్స్ విభాగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమాజం, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనేలా విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేయాలని సూచించారు. పరిశోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలు, ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ పరిశోధన నిరంతర ప్రక్రియ అని, జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలను ప్రచురించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య మాట్లాడుతూ పీహెచ్‌డీ, పీజీ, డిగ్రీ విద్యార్థులకు పరిశోధన పద్ధతులపై కార్యశాల ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు.కార్యశాల సమన్వయకర్త డాక్టర్ ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ పరిశోధన పద్ధతులు, గణాంక శాస్త్ర విధానాలపై విద్యార్థులకు నైపుణ్యం కల్పించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. డాక్టర్ డి. వెంకట్రావు గణాంక పద్ధతులపై, డాక్టర్ హర్ జ్యోత్ కౌర్, డాక్టర్ కుమార్ కిరణ్‌కుమార్ పరిశోధన నివేదిక తయారీ, పరిశోధనకు ఉపయోగపడే ఏఐ సాధనాలపై అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ నితిన్, టి రాజయ్య , ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి హరికాంత్, సదస్సు వక్తలు డాక్టర్ డి వెంకట్రావు, డాక్టర్ రొట్టె కిరణ్ కుమార్, కార్యశాల సమన్వయకర్త డాక్టర్ డాక్టర్ ఎం మల్లారెడ్డి, ఐక్యూఏసి సమన్వయకర్త డాక్టర్ హర్ జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఆర్ రామకృష్ణ డాక్టర్ బూర్ల నరేష్, డాక్టర్ కే అర్జున్, ఎం శిరీష,టి. అరవింద్, బి నర్మద, సిహెచ్ పూర్ణచందర్, గౌతమి, ప్రజ్ఞ, మల్లేశం, రాజు, శిరీష , నాగరాజు, కే రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేరపల్లిలో కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ



**కమాన్ పూర్, ఆగస్ట్ 13, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని పేరపల్లి గ్రామ అర్హులైన ప్రజలు కొత్త పింఛన్లకు దరఖాస్తుల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'చేయూత' పథకం కింద నూతన పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను గురువారం స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. చేయూత పథకం కింద నూతన పింఛన్లు మంజూరు కానున్నందున అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేవారు ప్రభుత్వం తెలిపిన పత్రాలతో పేరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అధికారుల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులందరికీ పింఛన్లు మంజూరవుతాయని తెలిపారు.

# మొగిలిపేటలో సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు



**మల్లాపూర్, ఆగస్టు 13 (జనం సాక్షి):** మండలంలోని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొగిలిపేట గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మెట్పల్లి సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో, ఎస్సై అనిల్ కుమార్ పర్యవేక్షణలో గురువారం సీసీటీవీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ సీసీటీవీ కెమెరాలు నేరాల నియంత్రణకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. నేరాల అణచివేత, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడంలో కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రమాదాలను గుర్తించి, సంబంధిత వివరాలను సేకరించేందుకు కూడా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. రోడ్లు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాల నిజానిజాలను తేల్చేందుకు కెమెరాల ఫుటేజ్ ఉపయోగపడుతుందని తెలిపారు. నేరస్తులను త్వరగా గుర్తించేందుకు రికార్డైన వీడియో ఫుటేజ్ పోలీసులకు బలమైన సాక్ష్యంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎస్సై అనిల్ యాదవ్ మాట్లాడుతూ వ్యాపార కేంద్రాలు, గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ఎంతో ప్రాముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజా నాయకులు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ



వీణవంక, ఆగస్టు 13 (జనం సాక్షి): వీణవంకలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వీణవంక మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ జిల్లా సంఘటన మంత్రి పందెం ప్రణీత్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పందెం ప్రణీత్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందని తెలిపారు. ఏబీవీపీ జాతీయ పునర్నిర్మాణాన్ని ధ్యేయంగా చేసుకొని విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, జ్ఞానం, శీలం, ఏకత వంటి విలువలను పెంపొందిస్తూ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ సామాజిక బాధ్యతను గుర్తించి దేశహితం కోసం పనిచేయాలని, జాతీయ పునర్నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. "యువతే భారతదేశ భవిష్యత్తు" అనే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా తిరంగా ర్యాలీలో పాల్గొనడం గర్వకారణమని పేర్కొంటూ దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు గోస్కుల అజయ్, వీణవంక మండల కన్వీనర్ సిద్ధార్థ్, మండల కో-కన్వీనర్ వినయ్, విష్ణు, విశాల్, అఖిలేష్ తదితర ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు పరిశీలిస్తూ రిజిస్టర్‌ను పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు (వాటర్ డిస్పెన్సరీలు) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది (సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులను పరిశీలించారు. అందిస్తున్న సౌకర్యాలను తెలుసుకుని, పాఠశాలలో వృథాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్‌ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృథాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.

## అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన



డాక్టర్ స్ట్రీట్‌లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోకి ఈ స్కూల్‌ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి, పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

# మండల కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జీల నియామకం



**మల్లాపూర్, ఆగస్టు 13 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో సోషల్ మీడియాకు సంబంధించిన మండల కన్వీనర్‌తో పాటు అన్ని గ్రామాల ఇన్‌చార్జీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు మాట్ల సోమయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లాల జలపతి రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని హామీ ఇచ్చారు.

# విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేసిన బండారి ప్రశాంత్



**జమ్మికుంట, ఆగస్టు 13 (జనం సాక్షి):** జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోవిందపూర్‌లో వాగును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రస్తుతం ఓవర్‌లోడ్ సమస్యను ఎదుర్కొంటుందని, ఆ సమస్యను పరిష్కరించాలని వెంకటేశ్వర్లపల్లి 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా పరిసర ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన మోటార్లు నడుస్తుండటంతో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అవసరాలకు సరిపడే సామర్థ్యం కలిగిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన విద్యుత్ అధికారులు సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ప్రశాంత్ తెలిపారు.

# "ఆదివరాహస్వామి" జయంతోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



**కమాన్ పూర్, ఆగస్టు 13 (జనం సాక్షి):** ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహించనున్న పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయంభూ "ఆదివరాహస్వామి" జయంతోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ రామగుండం ఎమ్మెల్యే మక్కా సింగ్ రాజ్ ఠాగూర్, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, ఆర్జీ-01 జీఎం లలిత్ కుమార్, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, అలాగే పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తదితరులకు ఆలయ కమిటీ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంతారెడ్డి, ప్రధాన అర్చకులు కలకుంట్ల వరప్రసాదాచార్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామానుజాచార్యులు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

# హెచ్ఐవి.. ఎయిడ్స్‌ను పారదోలుదాం

### ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జి. సుబ్బారావు



**గోదావరిఖని, ఆగస్టు 13 జనంసాక్షి:** హెచ్ఐవి-ఎయిడ్స్‌ను పారదోలుదామని ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి. సుబ్బారావు పిలుపునిచ్చారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం, హెల్త్ కేర్ విభాగం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీటీసీ విభాగాల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీటీసీ విభాగ కౌన్సిలర్ శంకర్ ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఎయిడ్స్ కేసులు ఒకప్పుడు అధికంగా ఉండేవని, ప్రస్తుతం అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ చొరవతో చాలా వరకు తగ్గాయని తెలిపారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం జంతుశాస్త్ర విభాగం, హెల్త్ కేర్ విభాగాల అధిపతి డాక్టర్ డి. కిరణ్మయి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి తెలుసుకోవాలని, విద్యార్థులు నిరక్షరాస్యులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి అని, దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి హెల్త్ కేర్ అధ్యాపకులు బి. ప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. సవిత, అధ్యాపకులు డాక్టర్ జి. శారద, పి. శ్రీదేవి, సుమలత, నివేదిత, స్రవంతి, సమత, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ మునిగంటి స్వప్న సంతోష్



సైదాపూర్, ఆగస్టు 13 (జనం సాక్షి): సైదాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సైదాపూర్ గ్రామ సర్పంచ్ మునిగంటి స్వప్న-సంతోష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ పరికరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, డాక్టర్లు, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రుల పాత్ర కీలకమని, ఎవరికీ ఎలాంటి వైద్య సాయం కావాలన్నా ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని సర్పంచ్ స్వప్న-సంతోష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపగోని నవీన్, వార్డు సభ్యులు వంగ తిరుమలేష్, పొడిశెట్టి అజయ్, మునిగంటి రాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో భాగంగా భీంగల్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ



**భీంగల్, ఆగస్టు 13 (జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా భీంగల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 1వ, 2వ, 3వ, 4వ, 5వ, 6వ వార్డుల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మహిళలకు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ హాజరయ్యారు. 1వ వార్డు కౌన్సిలర్ ఆరేపల్లి శ్రీజ నాగేంద్రబాబు, 2వ వార్డు కౌన్సిలర్ పర్స కుశలత అనంతరావు, 3వ వార్డు కౌన్సిలర్ తోట సతీష్, 4వ వార్డు కౌన్సిలర్ గుణాల బాల లక్ష్మి, 5వ వార్డు కౌన్సిలర్ లావణ్య నర్సయ్య పాల్గొని మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు వనమహోత్సవ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని భీంగల్ పట్టణాన్ని పచ్చదనంతో నింపాలని ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతుంది




**సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13 (జనం సాక్షి):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఏవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సర్టిఫికెట్ల కోసం ప్రైవేట్ కళాశాలల చుట్టూ తిరుగుతూ డబ్బులు చెల్లించుకోలేక చదువును మధ్యలోనే ఆపివేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉంటూ విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అనేక హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం విద్యార్థులను విస్మరించడం సరికాదని హెచ్చరించారు. వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే జిల్లాలో మంత్రులను, ఎమ్మెల్యేలను తిరగనివ్వమని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సరిపడా తరగతి గదులు కేటాయించాలని, వెంటనే స్ట్రాంగ్ రూములను ఎలక్షన్ కమిషన్ ఖాళీ చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లాలో బీసీ మహిళా కళాశాల హాస్టల్ భవనాన్ని ఏర్పాటు చేయాలని, ఎస్టీ కళాశాల బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కదారి శివ, జిల్లా నాయకులు సాయిరాం, రషీద్, విజయ్, బాలాజీ, ఆదిత్య, రేహాన్, మానస, అఖిల, ప్రియాంక, ప్రవళిక, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హత్య రాజకీయాలు చేయడం కాంగ్రెస్ చరిత్రలోనే లేదు




**సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ల వరకే రాజకీయం చేస్తుందని, ఆ తర్వాత సంక్షేమ, అభివృద్ధి పనులు చేపడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా తెలంగాణలో నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా, తారతమ్య భేదం లేకుండా ఏ సంఘటన జరిగినా నిందితులను విచారించి కేసులు నమోదు చేసి శిక్షపడేలా చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలతోనే ముడిపడి ఉందని, ఎలక్షన్ల వరకే రాజకీయం చేస్తుందిగానీ ఆ తర్వాత సంక్షేమ, అభివృద్ధి పనులు చేపడుతుందని అన్నారు. దీనిని హత్య రాజకీయంగా కాంగ్రెస్ పార్టీపై రుద్దడం సరైనది కాదన్నారు. గత వారం రోజుల క్రితం జరిగిన హత్య సంఘటనను బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా మలుచుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. మృతుడు వెంగళ వెంకటేశం అంతకుముందు వీడియో ద్వారా ఏం మాట్లాడారు, ప్రజావాణిలో ఏ దరఖాస్తు పెట్టారు అనేది ప్రజలందరికీ తెలుసని అన్నారు. హత్య రాజకీయాలతో లబ్ధి పొందడానికి కేటీఆర్ మృతుని ఇంటికి వెళ్లి పరామర్శించిన అనంతరం కాంగ్రెస్ పార్టీపై మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంగళ వెంకటేశం మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం ఏ విధంగా అందిస్తారో అందించాలని, కానీ ఈ హత్యను రాజకీయంగా కాంగ్రెస్ పార్టీపై రుద్దడం సరైనది కాదన్నారు. దీనిని ఖండిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన నేరెళ్ల సంఘటనను ఇప్పటివరకు కూడా ప్రజలు మర్చిపోలేరని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గానీ, కార్యకర్తలు గానీ ఎక్కడ కించిత్ తప్పు చేయలేదని, క్రమశిక్షణతోనే పనిచేస్తారని అన్నారు. మృతుని కుటుంబానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం, ఆడెపు చంద్రకళ, లింగంపల్లి గంగరాజు, నాయకులు రాగుల జగన్, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం

### అందించిన వెంకటేశ్వరరావు మాధవి



ముస్తాబాద్, ఆగస్టు 13 (జనం సాక్షి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని సాకలి సంగీత, గుటకడి వజ్రవ్వ అనే రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాన్ని చిట్లేని మాధవి వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుంచు బాబు, కొల్లూరి శంకర్, సుంచు మల్లన్న, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లూరి నాగరాజు, ముక్క మల్లయ్య, శీలం దేవయ్య, సుంచు శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.


# కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ డిపోల పనితీరుపై సమీక్ష

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 13, (జనం సాక్షి):** కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితిపై రీజనల్ మేనేజర్ బి. రాజు సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశానికి రీజియన్ పరిధిలోని 11 మంది డిపో మేనేజర్లు, ట్రాఫిక్, సిస్టమ్ సూపర్‌వైజర్లు హాజరయ్యారు. జూలై నెలాఖరు వరకు ఆపరేషన్స్, మెకానికల్ విభాగాల్లో డిపోల పనితీరును సమీక్షించారు. బస్సుల నిర్వహణ, ఆదాయ వృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, ప్రమాదాల నివారణ చర్యలపై చర్చించారు. బస్ ఆన్ కాంట్రాక్ట్, ప్యాకేజీ టూర్లకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ మాట్లాడుతూ డిపోలను లాభాల బాటలో నడిపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆదాయం పెంచడంతో పాటు నిర్వహణ వ్యయాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో రీజనల్ మేనేజర్ బి. రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతి రెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) పి. మల్లేశం, డిపో



మేనేజర్లు సి.హెచ్. కవిత, ఎన్. వెంకన్న, వి. రవీంద్రనాథ్, ఐ. విజయమాధురి, ఎం. శ్రీనివాస్, ఎన్. రమేశ్, ఎన్. మనోహర్, డి. హరి, ఎ. ప్రకాశరావు, బి. శ్రీనివాస్, ఎం. సంపత్ కుమార్, పర్సనల్ ఆఫీసర్, రీజనల్ మేనేజర్ కార్యాలయ సూపర్‌వైజర్లు శ్రీమతి ఎం. స్రవంతి, శ్రీమతి ఆర్. జ్యోత్స్న, అన్ని డిపోల ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, సిస్టమ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# రేపే పంద్రాగస్టు.. విద్యార్థులకు అందని స్కూల్ యూనిఫామ్‌లు




**గంభీరావుపేట, ఆగస్టు 13 (జనం సాక్షి):** రేపే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు అందకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా కొత్త యూనిఫామ్‌లు అందక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పాఠశాల యూనిఫామ్ రంగును మార్చినప్పటికీ, కొత్త యూనిఫామ్‌ల పంపిణీ మాత్రం పూర్తికాలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో కొంతమంది విద్యార్థులు పాత, చిరిగిన దుస్తులతోనే పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆగస్టు 15న పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులు కొత్త యూనిఫామ్‌లతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫామ్‌లను త్వరితగతిన పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# మెడికవర్‌లో ప్రతినెల 2వ గురువారం ఉచిత క్యాన్సర్ శిబిరం

- మొదటి శిబిరంలో 186 మందికి పరీక్షలు చేయగా, 26 మందికి పాజిటివ్..
- హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధి నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి మొత్తం 186 మంది హాజరై క్యాన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి నెల రెండో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం, అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ కరీంనగర్‌లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళల్లో ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ రావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అయితే క్యాన్సర్ లక్షణాలు స్పష్టంగా బయటపడకముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి తగిన చికిత్స అందించవచ్చన్నారు. క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే వ్యాధి దశ పెరిగే కొద్దీ తీవ్రత కూడా పెరుగుతుందని, తద్వారా చికిత్స మరింత క్లిష్టతరంగా మారే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. ఊబకాయం బారిన



పడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా కొంతమందినైనా కాపాడాలనే ఉద్దేశంతో మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహిస్తోందని వైద్యులు తెలిపారు. ముందస్తు గుర్తింపు, సరైన సమయంలో చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్‌హెడ్ సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, పీఆర్ అబ్దుల్‌వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు ఘన స్వాగతం



**కమాన్ పూర్, ఆగస్టు 13 (జనంసాక్షి):** అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకొని మంథనికి వచ్చిన పెద్దపల్లి జిల్లా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పెద్దపల్లి--మంథని ప్రధాన రహదారి కమాన్ పూర్ క్రాస్ రోడ్ వద్ద మండల కన్వీనర్ తాటికొండ శంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని పుట్ట మధుకు ఘన స్వాగతం పలికారు.

# రాజన్న సిరిసిల్ల వాసికి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం

### 'శ్రీమద్రామాయణం'కు 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం

**గంభీరావుపేట, ఆగస్టు 13 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ, సీనియర్ గ్రూప్-1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రామాయణం' ప్రతిష్ఠాత్మక 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిస్తూనే గత రెండు దశాబ్దాలుగా సాహిత్య సాధన కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్.. సామాన్య పాఠకుడికి సైతం సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో, ఛందోబద్ధంగా 'శ్రీమద్రామాయణం'ను రచించారు. ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించింది. సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేస్తూనే, వ్యక్తిగత జీవితంలోనూ నైతిక విలువలు, నిజాయితీకి ప్రాధాన్యమిచ్చే అధికారిగా శశికిరణ్ కొమాండూర్‌కు సహచర అధికారుల్లో








మంచి గుర్తింపు ఉంది. గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కోసం ఆయన పేరు పరిశీలనకు వచ్చినప్పటికీ, అప్పట్లో తాను సంబంధిత కేంద్ర మంత్రి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నందున, పదవిలో ఉన్న సమయంలో తన శాఖకు సంబంధించిన పురస్కారాన్ని స్వీకరించడం నైతికంగా సముచితం కాదని భావించి ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించారు. నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శశికిరణ్ కొమాండూర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం లభించడం పట్ల కవులు, రచయితలు, సాహితీవేత్తలు, ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాండూర్‌ను లోక్ భవన్‌లో గ్రూప్-1 అధికారుల సంఘం, లోక్ భవన్ అధికారులు ఘనంగా సత్కరించారు. గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, గవర్నర్ ఉప కార్యదర్శి జి. పల్లవి, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, సమన్వయ అధికారి మురళీచార్యులు, అకౌంట్స్ ఆఫీసర్ శైలజ, అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్. హెరాల్డ్ డేవిడ్, ఉద్యానవన అధికారిణి మాలిని, డీఈఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్. రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్, ఏఈఈలు హర్షవర్ధన్, త్రిష తదితరులు శశికిరణ్ కొమాండూర్‌ను సత్కరించి అభినందించారు. లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేకంగా శశికిరణ్ కొమాండూర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామం నుంచి సాహిత్య రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే దిశగా సాగుతున్న శశికిరణ్ కొమాండూర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల స్వగ్రామం, జిల్లా వాసులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యూనియన్ బ్యాంక్ బోధన్ బ్రాంచ్ పునఃప్రారంభం



**బోధన్, ఆగస్టు 13 (జనంసాక్షి):** బోధన్ పట్టణంలో ఆధునిక సదుపాయాలతో నూతనంగా తీర్చిదిద్దిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ (బోధన్)ను హైదరాబాద్ జోనల్ హెడ్ అండ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, రైతులు, స్వయం ఉపాధిదారులు, ఉద్యోగులు, సామాన్య ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను సౌకర్యవంతంగా అందించడంతో పాటు రుణాల ద్వారా ఆర్థికంగా అండగా నిలవడమే తమ బ్యాంకు లక్ష్యమని తెలిపారు. అనంతరం పలువురు వ్యాపారస్తులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం అండ్ రీజినల్ హెడ్ (నిజామాబాద్) కె. అరుణ సవిత, బోధన్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఆశిష్ సింగ్ చౌహాన్, డిప్యూటీ మేనేజర్ అనుజ, తాలుకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి, బ్యాంకు సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై అవగాహన



మల్లాపూర్, ఆగస్టు 13 (జనంసాక్షి): మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) వినియోగంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్ ఫర్ సిటిజన్ రైట్స్ సీసీఆర్ విజయ్ నేత తెలిపారు. సమాజంలో పారదర్శకత, బాధ్యత పెంచేందుకు ప్రతి పౌరుడు ఆర్టీఐ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామంలో జరిగే పనులు, ఖర్చులు, తీసుకునే నిర్ణయాలు ప్రజలకు స్పష్టంగా తెలిసేలా చేయడంలో ఆర్టీఐ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకొని అవసరమైన సమాచారాన్ని అధికారులను అడగడం ద్వారా అవినీతిని అరికట్టవచ్చని అన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పారదర్శక పాలన సాధించేందుకు ఆర్టీఐ ఒక శక్తివంతమైన సాధనమని విజయ్ నేత వివరించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రజల్లో అవగాహన పెరగడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా యువత ముందుకు వచ్చి ఆర్టీఐ వినియోగంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం పెరగాలంటే ప్రజలు ప్రశ్నించే సంస్కృతిని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. ప్రతి పౌరుడు ఆర్టీఐ చట్టాన్ని వినియోగించుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కౌన్సిలర్ ఫర్ సిటిజన్ రైట్స్ విజయ్ నేత కోరారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లక్ష్యం




వీణవంక, ఆగస్టు 13 (జనం సాక్షి): వీణవంక, హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాజకీయాల ప్రధాన అజెండా అని వీణవంక బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ ప్రతి సమస్యపై స్పందిస్తూ ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా కేవలం ప్రచారానికే పరిమితమైతే ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని కామిడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

# అవయవదానాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి



బోధన్, ఆగస్టు 13 (జనంసాక్షి): అవయవదానాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలని బోధన్ ఆర్డీవో విజయ కుమారి పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని విద్యా వికాస్ కళాశాలలో లయన్స్ క్లబ్, ప్రపంచ అవయవ దాన సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో విజయ కుమారి మాట్లాడుతూ అవయవదానం ద్వారా మరొకరికి ప్రాణం పోయడం జరుగుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అవయవదానంలో పాల్గొనాలని అన్నారు. అనంతరం అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి సమక్షంలో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవయవదానంపై అవగాహన కల్పించడానికి తయారు చేసిన పోస్టర్లు, సావిత్రిబాయి పూలే వార్షిక కాలమానాన్ని ఆర్డీవో చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ పోలవరపు బసవేశ్వర్ రావు, లయన్స్ క్లబ్ ప్రముఖులు కొడాలి కిషోర్, శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రామగుండం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్జీ-2 జీఎం



యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి) ఆగస్టు 13: రామగుండం శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను సింగరేణి ఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో భేటీ అయిన జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ పుష్పగుచ్ఛంతో పాటు మొక్కను అందజేసి ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌తో సింగరేణి సంస్థలో కొనసాగుతున్న కార్యకలాపాలు, ఆర్జీ-2 ఏరియా అభివృద్ధి, సంస్థ పురోగతి తదితర అంశాలపై జీఎం చర్చించారు. ముఖ్యంగా సింగరేణి సంస్థకు వెన్నెముకగా నిలుస్తున్న కార్మికుల సంక్షేమం, వారికి అందుతున్న సౌకర్యాలు, కార్మికుల సమస్యల పరిష్కారం, భద్రతా చర్యలు తదితర అంశాలపై ఇరువురు పరస్పరం చర్చించుకున్నారు. అలాగే ఆర్జీ-2 ఏరియాలో సంస్థ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరంపై కూడా చర్చించారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్, జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మాలోతి రాముడు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన విస్తృతంగా కల్పించాలి

- రోగులకు కౌన్సెలింగ్, మెరుగైన వైద్యం అందించాలి.
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 13 (జనం సాక్షి): ఎయిడ్స్ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎయిడ్స్ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, విద్య, యువజన శాఖ, జడ్పీ సీఈవో తదితర అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఎన్ని ఉన్నాయి, వారు ఎక్కడ వైద్య సేవలు పొందుతున్నారు, మందులు, కౌన్సెలింగ్ తదితర సేవలు ఎక్కడ పొందుతున్నారని అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో మొత్తం 1283 పాజిటివ్ కేసులు ఉన్నాయని, వారికి నెలనెలా మందులు అందిస్తున్నామని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఎయిడ్స్ రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు నిరంతరం వైద్యం, మందులు, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాజిటివ్ కేసులు వచ్చిన చోట పకడ్బందీగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఒక షెడ్యూల్ సిద్ధం చేయాలని, దాని ప్రకారం పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. యువత, విద్యార్థులకు అవగాహన సమావేశాలు, పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీడీకే 2, 2ఏ గనుల్లో సురక్ష, తిరంగా, సైబర్‌పై అవగాహన




గోదావరిఖని,ఆగస్టు 13 జనంసాక్షి: సింగరేణి ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్ ఆదేశానుసారం, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మారుతి ఆధ్వర్యంలో గురువారం జీడీకే 2, 2ఏ ఇంక్లైన్‌లో, జీడీకే 2 సెక్షన్‌లో సురక్ష, తిరంగా, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మారుతి సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు తప్పనిసరిగా 1930కి కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని, ఆలస్యమైతే డబ్బులు రికవరీ చేయడం కష్టమవుతుందని తెలిపారు. వాట్సాప్‌లో పోలీసులమని బెదిరింపు కాల్స్ వస్తే భయపడకుండా కాల్ కట్ చేసి సమీపంలోని సైబర్ క్రైమ్ బృందానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. తెలియని కాల్స్, యాప్‌లు, ఏపీకే ఫైల్స్ వస్తే వాటిని ఓపెన్ చేయకుండా వెంటనే డిలీట్ చేయాలని, ఫోన్‌కు వచ్చే అనుమానాస్పద లింకుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ ఎంటర్ చేయవద్దని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, పాన్, ఆధార్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. పెట్టుబడులకు సంబంధించిన సైబర్ మోసాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ ఇజ్జగిరి శివయ్య, డి. గణేష్ వెల్ఫేర్ ఆఫీసర్, సల్మాన్ ఖాన్ సెక్షన్ ఇంచార్జ్, జి. కుమారస్వామి వెంటిలేషన్ ఆఫీసర్, గని అధికారులు, పొన్నాల వెంకటయ్య పిట్ సెక్రటరీ, సూపర్వైజర్లు, మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కమాన్‌పూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మచ్చ రవీందర్



కమాన్‌పూర్, ఆగస్టు 13 (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మచ్చ రవీందర్ (గుండారం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా జంగపల్లి ఎర్రయ్య (పేరపల్లి), కోశాధికారిగా ఈదునూరి శంకరమ్మ (కమాన్‌పూర్), కార్యదర్శిగా ఆబిడి తిరుపతమ్మ (జూలపల్లి), ప్రధాన కార్యదర్శిగా కేశెట్టి చంద్రశేఖర్ (కమాన్‌పూర్) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కేశెట్టి శ్రీనివాసు, కటకం నారాయణ, గంధం కృష్ణ, మేకల స్వామి, ఆబిడి తిరుపతమ్మ, తాటిపెల్లి భూమయ్య, పంతకాని రవి, మల్లేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మచ్చ రవీందర్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



**కథలాపూర్ ఆగస్టు 13 (జనం సాక్షి )**భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.మండల అధ్యక్షులు మల్యాల మారుతి మాట్లాడుతు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు చెప్పట్టడం జరిగిందన్నారు. ప్రజలలో దేశభక్తి ని పెంచడమే లక్ష్యంగా,దేశం కోసం పోరాడిన వ్యక్తులను స్మరించుకోవడం కోసం ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. 2047 వరకు ప్రపంచంలో భారత దేశాన్ని విశ్వగురువుగా ఎదగడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంతో ముందుకెళుతున్నారన్నారు. జెండా పట్టుకుంటే ర్యాలీ అవుతుంది.గుండెలో ఉంటే దేశ భక్తి అవుతుందన్నారు. ప్రతిఒక్క పౌరుడు తమ ఇంటిపై జాతియ జెండాను ఎగురవేయలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొడిపెల్లి గోపాల్ రెడ్డి,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్రావు,ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి,కథలాపూర్ మహేష్,సీనియర్ నాయకులు బద్రి సత్యం, గాందరి శ్రీనివాస్,ఆరేశివ,రాజేష్,నరేందర్,శ్రీధర్,గంగాధర్,మహేష్,రాజేష్,శ్రీకర్,ప్రసాద్,అజయ్,సునీల్,మహేష్,సాయిరెడ్డి,నరేష్,వెంకటేష్,కిరణ్,చరణ్,రూపేష్, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**బాల్కొండ న్యూస్ 13 ఆగస్టు (జనం సాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధ్యా యులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం బాల్కొండ తహసిల్దార్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఇందులో భాగంగా తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. పిఆర్సి వెంటనే ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని, కేజీబీవీ గురుకుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఈ నెల 21న జిల్లా కేంద్రంలో ధర్నాలు, 29న రాష్ట్ర రాజధానిలో వేలాది మంది ఉపాధ్యాయులతో భారీ నిరసన కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఓ.రమేష్, ఒడ్నాల శ్రీనివాస్ బోయిడ నరసయ్య కే చంద్రశేఖర్ పబ్బ శంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలిక ప్రాణాలు కాపాడిన యువకులకు సన్మానం




**గోదావరిఖని,ఆగస్టు 13(జనంసాక్షి** :బొక్కలవాగులో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతున్న బాలికను ధైర్యసాహసాలతో రక్షించిన బోయినిపేటకు చెందిన అంకం శేఖర్, ఆకుల అరవింద్‌లను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తన కార్యాలయంలో అభినందించి సన్మానించారు.మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలవాగు వద్ద బోయినిపేటకు చెందిన పర్వవేన రాజు తన కుమార్తె అలేఖ్యతో కలిసి గొర్రెల మందను వాగు దాటించే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో జారిం ద్దాడు.తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించిన అలేఖ్య కూడా నీటిలో మునిగిపోతూ కేకలు వేసింది.అదే సమయంలో అటుగా వెళ్తున్న అంకం శేఖర్ వెంటనే స్పందించి నీటిలోకి దిగి అలేఖ్యను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోవడంతో శేఖర్, ఆకుల అరవింద్ కలిసి ప్రథమ చికిత్స అందించి ఆమెను స్పృహలోకి తీసుకువచ్చారు. అనంతరం అలేఖ్య తన తండ్రి కూడా నీటిలో మునిగిపోయినట్లు చెప్పడంతో ఇద్దరూ వాగులోకి దిగి రాజును బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఆపద సమయంలో ప్రాణాలకు తెగించి బాలికను కాపాడటంతో పాటు ఆమె తండ్రిని రక్షించేందుకు ప్రయత్నించిన శేఖర్, అరవింద్‌ల ధైర్యసాహసాలను ఏసీపీ ఎం.రమేష్ అభినందించారు. ఏసీపీ కార్యాలయంలో మంథని సీఐ బుద్దె స్వామి,ఎస్ఐ సాగర్‌ల సమక్షంలో వారిని శాలువాలతో సత్కరించి,ఆపదలో మానవత్వంతో స్పంది ంచినందుకు అభి నందనలు తెలిపారు.ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు సమయస్ఫూర్తితో స్పందించడం అభినందనీయమని, వారి ధైర్య సాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని ఏసీపీ పేర్కొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో జమ్మికుంట తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా




**జమ్మికుంట,ఆగస్టు 13 (జనం సాక్షి)**:ఆల్ మండల్ హమాలి యూనియన్ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి,అనంతరం తహసిల్దార్ కి వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ హమాలి కార్మికులు అనేక సంవత్సరాల నుండి ఎగుమతులు, దిగుమతులు చేస్తూ పనిచేస్తున్నారని,కానీ వారికి ఎలాంటి బెనిఫిట్స్ ప్రభుత్వం నుండి రావడంలేదన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు 8 నెలలు కడుస్తున్నదని, ఎన్నికల మేనిఫెస్టోలో హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారన్నారు.కానీ ఇంత వరకు ఎలాంటి సమస్యలు పరిష్కరి ంచలేదన్నారు. అలాగే హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని,సంక్షేమ పథకాలు అమలు చేయాలని.హమాలి కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వం చే 55 సంవత్సరాలు కార్మికుల అందరికీ, ప్రతి ఒక్కరికి రూ.6000 పింఛను ఇవ్వాలని,ఇండ్లు లేని హమాలీ కార్మికుల అందరికీ ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి 120 గజాల స్థలంలో ఇల్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ,ప్రభుత్వం నేరుగా గుర్తింపు కార్డులు అందించాలని,ప్రమాదంలో మరణించిన హమాలీ కార్మికులకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి కోరారు.ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు జక్కుల రమేష్ యాదవ్,రావుల ఓదే లు,కొండ్ర క్రాంతి, మారపల్లి కిరణ్,పుట్టపాక రాజేందర్,సంతోష్, సుమన్ శ్రీనివాస్,ప్రవీణ్,సురేష్, బండి శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టీపీసీ రామగుండం గ్రాండ్ మాస్



**గోదావరిఖని,ఆగస్టు13జనంసాక్షి** :భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భాగంగా, ఎన్‌టీపీసీ రామగుండం సెంట్ క్లైర్ స్కూల్, రామగుండంలో గ్రాండ్ మాస్ 'వందే మాతరమ్' గానం మరియు 'వందే మాతరమ్' డిజైన్ ఫార్మేషన్‌ను ఏర్పాటు చేసింది.ప్రధాన అతిథిగా చంద్రన్ కుమార్ సమంతా, ఈడీ (ఆర్ అండ్ టీ) ప్రసంగించగా, ఇతర వృద్ధ అధికారులు మరియు గౌరవనీయ అతిథులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సుమారు 1,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ఎన్‌టీపీసీ ఉద్యోగులు స్వాతంత్ర్య భావన మరియు జాతీయ గర్వంతో కలిసి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఒక అద్భుతమైన 'వందే మాతరమ్' డిజైన్‌ను రూపొందించి, దేశానికి విజువల్‌గా చైతన్యాత్మక ట్రిబ్యూట్ గా చూపించారు. ఆ తరువాత వారు భావభరిత 'వందే మాతరమ్' గీతాన్ని కలిసి పాడారు.ఈ కార్యక్రమం ఐక్యత, స్వాతంత్ర్య భావం మరియు గర్వం మేళవిన సభ్యతను ప్రతిబింబిస్తూ, మన స్వాతంత్ర్య సమర పోరాటంలోని శాశ్వత తీతీహ్యాలను జరుపుకుంటూ, మరింత బలమైన మరియు సమృద్ధిగా ఉన్న భారత్‌ను నిర్మించడంలో అందరినీ ప్రేరేపించింది.

# ఎల్-నినో ప్రభావంతో వరి పంటను తగ్గించి ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి



**చిగురుమామిడి ఆగస్ట్ 13 (జనంసాక్షి):** ప్రత్యేక గ్రామ సభలో ఎల్–నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై రైతులకు గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ గురువారం అవగాహన కల్పించారు.గ్రామ పంచాయతీలో ఎల్–నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్–నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.రైతులు తమ భావులు,బోర్లలోని భూగర్భ జలాల సామర్థ్యం బట్టి వరి పంటనీ తగ్గించి వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల ప్రణయ్ మాట్లాడుతూ వర్షాలు ఆలస్యమైనా లేదా తక్కువగా కురిసినా రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ శాఖ రూపొందించిన కంటింజెన్సీ క్రాప్ ప్లాన్‌ను అనుసరించాలని తెలిపారు.స్వల్పకాలిక పంటలు,తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంపిక చేసుకోవడం,నేలలో తేమను సంరక్షించడం,సమతుల్య ఎరువుల వినియోగం,కలుపు నియంత్రణ, వర్షపు నీటి సంరక్షణ వంటి శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులను మెరుగుపరచవచ్చని వివరించారు.అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేసి,పంటల ఎంపిక, విత్తనాల వినియోగం,సాగు యాజమాన్యంపై పలు సూచనలు అందించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతుబ్బుద్దీన్,ఉపసర్పంచ్ ముంజ పర్శరాములు,గ్రామ కార్యదర్శి అరుణ్ కుమార్,పాలకవర్గ సభ్యులు జగన్,పశ్చిమట్ల శ్రీను,డిసిఎం స్ ఇంచార్జ్ చీల లక్ష్మారెడ్డి,ఆత్మ కమిటీ మెంబర్ డోకి నరేష్,గ్రామ రైతులు జక్కుల బాబు,మొహమ్మద్ షరీఫ్,ఇల్లందుల రాములు,ఇతర రైతులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన పొందారు.

# మెడికవర్‌లో ప్రతినెల 2వ గురువారం ఉచిత క్యాన్సర్ శిబిరం




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :** క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధి నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం రోజు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి మొత్తం 186 మంది హాజరై క్యాన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి నెల రెండో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కరీంనగర్లో విలేకరుల సమావేశంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ... కరీంనగర్‌లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళల్లో ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ రావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అయితే క్యాన్సర్ లక్షణాలు స్పష్టంగా బయటపడకముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి తగిన చికిత్స అందించవచ్చన్నారు. క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే వ్యాధి దశ పెరిగే కొద్దీ తీవ్రత కూడా పెరుగుతుందని, తద్వారా చికిత్స మరింత క్లిష్టతరంగా మారే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. ఊబకాయం బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా కొంతమందినైనా కాపాడాలనే ఉద్దేశంతో మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహిస్తోందని వైద్యులు తెలిపారు. ముందస్తు గుర్తింపు, సరైన సమయంలో చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్‌హెడ్ సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, పీఆర్ అబ్దుల్‌వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఐ చట్టంపై పుస్తకం ఆవిష్కరణ



**భిక్కనూరు ఆగస్టు 13 (జనం సాక్షి) :** భిక్కనూరు మండల కేంద్రంలో సమాచార హక్కు చట్టం 2005 పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన అవగాహన పుస్తకం కరపత్రాలు గురువారం భిక్కనూరు పోలీస్ స్టేషన్ లో ఎస్సై ఎస్.అనిల్ కుమార్ ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 పై మండలంలోని వివిధ గ్రామాల్లో అవగాహన కార్యక్రమంలో నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం. ఏ సలీంను అభినందించారు, ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు, ఆర్టిఐ కమిటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అందేలా భవాని రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు సమాచార చట్టం ఒక వజ్రఆయుధం లాంటిదని అన్నారు, ప్రతి పౌరుడు ప్రభుత్వ శాఖల నుంచి తనకు అవసరమైన సమాచారాన్ని పొందేందుకు ఆర్టిఐ చట్టాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు,ఈచట్టంలో సెక్షన్ 6(1) ప్రకారం సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకుంటే కోరిన సమాచారాన్ని సాధారణంగా 30 రోజులలోపే పొందవచ్చని వివరించారు, నిర్ణీత గడువులోపు సమాచారం అందకపోతే చట్టపరమైన అప్పీల్ ప్రక్రియ ద్వారా న్యాయం పొందే అవకాశం ఉందని తెలిపారు,ఈకార్యక్రమంలో కామారెడ్డి టౌన్ కార్యదర్శి ఏ, రవికుమార్,జిల్లా సలహాదారులు కే,శ్రీనివాసరావు,ఏ, సాయికుమార్,పోలీస్ సిబ్బంది కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమ బాట



**వేములవాడ రూరల్, ఆగస్టు 13 (జనంసాక్షి):** ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే సెప్టెంబరు 1 తర్వాత ఉద్యమం తప్పదని పిఆర్‌టియు టిఎస్ (గ్రా=ఖ ఖా) నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్, రూరల్ మండలాల్లో గురువారం పిఆర్‌టియు టిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్ పిఆర్ సి, డిఏ లను వెంటనే విడుదల చేయాలని మరియు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, శ్రీకాంత్ రావు, పులి రాజా గౌడ్, మానువాడ శంకర్, అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు కిరణ్, రాంప్రభు, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, మధుకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఇంటర్ లింక్ లైన్లు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 13, (జనం సాక్షి)** కరీంనగర్ సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు 18 ఇంటర్ లింక్ లైన్లను ఏర్పాటు చేసినట్లు సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆర్. రవీందర్ తెలిపారు.ఒక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు మరో సబ్‌స్టేషన్ లేదా లైన్ నుంచి ప్రత్యామ్నాయ సరఫరా అందించేందుకు 33 కేవీ ఇంటర్ లింక్ వ్యవస్థ ఉపయోగపడుతుందని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు, నిర్వహణ పనులు, ఇతర కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో వినియోగదారులకు త్వరగా సరఫరాను పునరుద్ధరించవచ్చన్నారు.కరీంనగర్ సర్కిల్ పరిధిలోని 96, 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో 66 సబ్‌స్టేషన్లకు సంబంధించిన 33 కేవీ లైన్లలో ఇంటర్ లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 11 కేవీ పరిధిలో 467 ఇంటర్ లింకింగ్ లైన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవస్థతో విద్యుత్ అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు వీలవుతుందని ఎస్ఈ తెలిపారు.

## యూరియా కోసం సొసైటీకి తాళం రైతుల ఆగ్రహం

**గంభీరావుపేట ఆగస్టు 13జనం సాక్షి ;** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. సాయంత్రం మూడు గంటలకు యూరియా యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని రైతులకు వ్యవసాయ సొసైటీ నుండి మెసేజ్ గ్రూపులో తెలియజేశారు కానీ, మూడు గంటల నుండి ఎంత చూసినా యూరియా బుక్కు కాలేదని యూరియా కోసం సొసైటీ వద్దకు వచ్చిన రైతులకు సరైన సరఫరా అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు వెంటనే స్పందించి, యూరియా యాప్ ను తీసేయాలని, యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చి రైతుల సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు



**మంథని, ఆగస్టు 13, ( జనంసాక్షి ) :** అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకొని మంథని నియోజకవర్గానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గారికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. కమాన్‌పూర్ క్రాస్ రోడ్ వద్ద పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికి, అనంతరం ర్యాలీగా బయలుదేరారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీలో రామగిరి మండల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంథని పట్టణంలోని పాత పెట్రోల్ బంక్ చౌరస్తా వద్దకు చేరుకున్న ర్యాలీ అక్కడి నుంచి రాజగృహ వరకు కొనసాగింది. అడుగడుగునా అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా స్వాగతం పలుకుతూ తమ అభిమాన నాయకుడిపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు. రాజగృహకు చేరుకున్న అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ - శైలజ దంపతులను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలతో ఘనంగా సత్కరించి, పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పారమిత ఎన్ సి సి కాడెట్లు




**కరీంనగర్ అర్బన్, ఆగస్టు 13 (జనంసాక్షి)** మన జాతీయ గీతం "వందే మాతరం" 150 సంవత్సరాల వేడుకలలో భాగంగా హర్ ఘర్ తిరంగా 2026 కార్యక్రమాన్ని స్థానిక మంకమ్మతోటలోని పారమిత ఎన్ సి సి కాడెట్లచే నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పారమిత 100 మంది ఎన్ సి సి కాడెట్లు మంకమ్మ తోటలోని పారమిత ఉన్నత పాఠశాలనుండి మహాత్మా జ్యోతిరావ్ పులే ప్రాంగణం వరకు త్రివర్ణ పతాకాన్ని చేత బట్టుకుని నగరంలోని వీదులగుండా "వందే మాతరం" జాతీయ గీతాన్ని ఆలపిస్తూ ర్యాలీగా వెళ్తూ "వందే మాతరం" గొప్ప తనం గురించి తెలియజేసి మాత్ర దేశం పట్ల తమకున్న దేశభక్తిని చాటారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ సి సి కాడెట్ల ను పారమిత పాఠశాల అధినేత డా.ఇనుగంటి ప్రసాద రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ సి సి కాడెట్లను పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.యం.ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజి, కవిత ప్రసాద్, సమన్వయ కర్తలు శ్రీనాథ్, చంద్ర సేన, ఎన్ సి సి ఆఫీసర్ ప్రశాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

# పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా

యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)ఆగస్టు 13: ఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్‌ను సెక్టార్-3 సీబీఎస్ఈ సింగరేణి హైస్కూల్ ఉపాధ్యాయ బృందం గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా జీఎం లక్ష్మీపతి గౌడ్‌కు శాలువా కప్పి సత్కరించడంతో పాటు మొక్కను అందజేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఉపాధ్యాయ బృందం జీఎం దృష్టికి తీసుకెళ్లింది. ముఖ్యంగా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, పాఠశాలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేయడం, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే విద్యార్థుల సంక్షేమం, వారి విద్యా, క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జీఎం లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో



పాఠశాలల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి అందుతున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎన్. వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు విద్యార్థులు

**చొప్పదండి ,ఆగస్టు 13 (జనం సాక్షి):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా చొప్పదండి పట్టణంలో 200 మీటర్ల భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు శ్రీ సాయిని మల్లేశం,కార్యక్రమ ఇంచార్జిగా రాదీజ రాష్ట్ర నాయకులు శ్రీ అడిచర్ల రాజు హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ సమైక్యతా భావంతో జాతీయ జెండాకు గౌరవం ఇవ్వాలని, హర్ ఘర్ తిరంగా స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్, కౌన్సిలర్లు రాజన్నల రాజు, జిట్టా మంగ కుమార్, జిల్లా యువమోర్చా అధ్యక్షులు సంగ



నరేష్, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ చల్ల అనుష్, మంచికట్ల మల్లేష్, పెంచికల రమాదేవి, గంగు సంపత్, మనీష్ రెడ్డి, అమరగొండ తిరుపతి, అశోక్, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, గుర్రం సమరసింహారెడ్డి, అనుకరి సాయి కృష్ణ, అర్జవెల్లి శ్రీనివాస్, కోటగిరి ప్రశాంత్, ఎండి ఆసిఫ్, జాగిరి రాజేందర్, బొడిగె ఆదిత్య, రాజ్ కుమార్, శేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే చొప్పదండి పట్టణంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# టిఆర్ఎస్ లోకి భారీ చేరికలు

**శంకరపట్నం ఆగస్టు 13 జనం సాక్షి:**తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలానికి చెందిన మహిళలు, యువత, వివిధ వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో చేరారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య--వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయ విధానాలకు ఆకర్షితులై మొలంగూర్, ధర్మారం, రాజాపూర్, అంబాలాపూర్, కన్నాపూర్ తదితర గ్రామాలకు చెందిన 150 మందికి పైగా స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. ఈ చేరికలతో నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు ప్రజల మద్దతు పెరుగుతోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు .కండువాలు కప్పి ఆహ్వానం మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ ఫౌండర్ చైర్మన్ చెన్నమల్ల చైతన్య నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజల్లో పార్టీ విధానాలపై నమ్మకం పెరుగుతోందనడానికి ఈ చేరికలే




నిదర్శనమని అన్నారు. సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ నాయకులు అతహర్, జైపాల్ రెడ్డి, సౌరభ్ సింగ్, రవిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2029లో కవితను సీఎంగా చేయడమే లక్ష్యం ఈ సందర్భంగా చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ.. 2029లో తెలంగాణ ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల కవితను చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. కవిత ప్రతిపాదిస్తున్న పాంచజన్య సూత్రాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలని, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత, సమాన అవకాశాలు కల్పిస్తూ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగు మల్లారెడ్డి, జిల్లా నాయకులు బొడిగ పరుశురాం గౌడ్, సౌరభ్ సింగ్, విద్యార్థి నాయకుడు ఉమర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులు, యువత, మహిళలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

**రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా**

**డంపింగ్ యార్డు సందర్శన**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 జనం సాక్షి : ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు.నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా, నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్ వల్ల ఒకరికి గాయాలు



ఇందల్వాయి ఆగస్టు 13 జనం సాక్షి షార్ట్ సర్క్యూట్ వల్ల ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన హైమద్ (32) అనే యువకునికి ప్రమాదవశత్తు షార్ట్ సర్క్యూట్ తగిలి తీవ్ర గాయాలతో ప్రాణప్రయస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గమనించి 108 అంబులెన్స్ లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని స్థానికులు తెలిపారు, సిర్నాపల్లి గ్రామానికి చెందిన హైమద్ లైన్మెన్ అనుమతి లేకుండా కేవలం ట్రాన్స్ఫార్మర్ దగ్గర ఉన్నటువంటి హ్యాండిల్ బంద్ చేసి వ్యవసాయ పొలం వద్ద విద్యుత్తు మరమ్మత్తు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగిందని స్థానికులు తెలిపారు దీంతో యువకుడు హైమద్ అపస్మారక స్థితిలోకి వెళ్ళగా స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించారు, ఈ మేరకు పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని ఇందల్వాయి పోలీసులు తెలిపారు..

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ..

**బిఇందల్వాయిలో ద్విచక్ర వాహనాలతో ప్రధాన వీధులలో ర్యాలీ**



**ఇందల్వాయి ఆగస్టు 13 జనంసాక్షి**

ఇందల్వాయి మండల కేంద్రం తో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలతో కలిసి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు జాలిల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు, మన దేశ గౌరవం మన తిరంగా జెండా,, మన గర్వం మన భారతదేశం అనే నినాదంతో ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో ద్విచక్ర వాహనాల ర్యాలీని ఘనంగా నిర్వహించారు, దేశభక్తి నినాదాలతో ర్యాలీ కొనసాగింది, నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొని తిరంగా ర్యాలీని దిగ్విజయం చేశారు, ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నయిడి రాజన్న, మఠం ల శేఖర్, శ్రావణ్, నాగేష్, తస్నీరు వాసు, లోకాని గోపి, మెండే అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## జఫర్ ఖాన్ పేట లో: రూ. 5.43 కోట్లతో మద్దెల వాగు బ్రిడ్జి ప్రారంభం

నియోజకవర్గానికి రహదారుల మహర్దశ : ముత్తారం, మంథని వెళ్లే ప్రయాణికుల చిరకాల వాంఛను తీరుస్తూ మంగపేట కూనారం టర్నింగ్ నుండి ముత్తారం వరకు రూ. 32 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు చేయించామని ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే పెద్దపల్లి – గర్రెపల్లి మేజర్ రోడ్డుకు రూ. 100 కోట్లు, సుల్తానాబాద్ – పెద్దపూర్ రోడ్డుకు రూ. 47 కోట్లు, కూనారం – పెద్దపల్లి రోడ్డుకు రూ. 14 కోట్లు, జఫర్ ఖాన్ పేట్ రింగ్ రోడ్డుకు రూ. 7 కోట్లు, శ్రీరాంపూర్ హెడ్ క్వార్టర్ సెంట్రల్ లైటింగ్‌కు రూ. 5.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.ఆగస్టు 17న శంకుస్థాపన ఉత్సవం : ఈ అభివృద్ధి పనులన్నింటికీ ఆగస్టు 17న సుల్తానాబాద్ పర్యటనలో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ మండలం మరియు నియోజకవర్గంలోని ప్రజలు,నాయకులు, సోదరీమణులు ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున సుల్తానాబాద్ తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుత వాతావరణం పత్తి, వరి పంటలకు ఎంతో అనుకూలంగా ఉందని, ఈసారి ఎకరాకు 15 క్వింటాళ్లకు తగ్గకుండా పత్తి దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రుల సహకారంతో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు అందించడం కోసం త్వరలో పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం శ్రీకారం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల పంటపొలాలకు చుక్క సాగు ఇవ్వలేదని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ రైతులకు ఉపయోగం లేదని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గజానావేనా సదయ్య,స్థానిక సర్పంచ్ యాదగిరి జ్యోష్ణ శ్రీనివాస్ మరియు ఎండీ మునీర్, లంక సదయ్య,తుల మనోహర్‌రావు,దేవేందర్‌రావు, మరియు పలు గ్రామాల సర్పంచ్ లు,ఉపసర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



ఇందల్వాయి మండల్ సిర్నాపల్లి గ్రామం లో జనం సాక్షి గ్రామ సర్పంచ్ పోగుల అనిత సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా పర్యాటక శాఖ అధికారి పవన్ కుమార్ సంస్థాన్ సిర్నాపల్లి గడి , వాటర్‌ఫాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోగుల అనిత సాయి కృష్ణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి ప్రోత్సాహం అందించాలని అధికారిని కోరారు. దీనికి స్పందించిన జిల్లా అధికారి పవన్ కుమార్ అభివృద్ధికి తమ వంతు సహకారం, ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.



## పేదల సొంతింటి కలకు ప్రభుత్వ సహకారం

**భిక్కనూరు ఆగస్టు 13 (జనం సాక్షి) :**

భిక్కనూరు మండల కేంద్రంలో 16 వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు సొంతింటికల పేదప్రజల చిరకాల స్వప్నం ఇందిరమ్మ గృహ నిర్మాణం పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్,వార్డు సభ్యులు కర్రోళ్ల రాజుతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు, ఈ సందర్భంగా కార్యదర్శి మహేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సొంతింటి కల ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కింద మంజూరైన లబ్ధిదారులు సకాలంలో పనులు చేపట్టి నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు, ఈక్రమంలో కోటాని స్వామి, భూమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు



# వెల్గటూర్ లో లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**వెల్గటూర్, ఆగస్టు 13(జనం సాక్షి):** వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు.ముఖ్య అతిథి గా పాల్గొన్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 80 మంది లబ్దిదారులకు రూ.25.56 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనారోగ్యం, వైద్య చికిత్స తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.. ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కొత్తపల్లి జోన్ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా బైక్ ర్యాలీ



**కొత్తపల్లి ఆగస్టు 13 (జనం సాక్షి)** భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కరీంనగర్ నగరంలో బిజెపి హర్ ఘర్ తిరంగా అభియాన్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నగరంలోని భారతీయ జనతా పార్టీ కొత్తపల్లి జోన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా భారీ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. పద్మనగర్ నుండి ప్రారంభమైన ఈ భారీ తిరంగా బైక్ ర్యాలీ, పద్మనగర్, శాంతినగర్, రాజీవ్ నగర్, వీధుల గుండా సాగి చింతకుంట అంబేద్కర్ విగ్రహం వరకు అత్యంత ఘనంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం గారు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ (మాజీ మేయర్) యాదగిరి సునీల్ రావు హాజరయ్యారు. జాతీయ జెండాను చేతబూని, కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ బైక్ ర్యాలీని ముందుండి నడిపించారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం అని నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరి గుండెల్లో జాతీయ భావం ఉప్పొంగేలా ఈ బైక్ ర్యాలీని తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరికి చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకొని కదం తొక్కడం నగరవాసులను విశేషంగా ఆకర్షించింది. బైక్ ర్యాలీ ముగింపు సందర్భంగా చింతకుంటకు చేరుకొని అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం వందేమాతరం గీతాన్ని, జాతీయగీతం జనగణమనను ఆలపించారు. జాతీయ సమైక్యతను, అఖండ భారత స్ఫూర్తిని చాటిచెప్పేలా జరిగిన ఈ తిరంగా బైక్ ర్యాలీ నగరంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్, కార్పొరేటర్లు వాసల్ రమేష్, వేముల చంద్రశేఖర్...

## పోలీసుల పేరుతో సైబర్ మోసాలకు
# పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందుతుల అరెస్ట్

- గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ, మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాల వివరాల సేకరణ
- బాధితుల నుండి సుమారు 15 లక్షల వరకు మోసాలు
- నిందుతులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలల్లో 28 కి పైగా కేసులు
- నిందుతుల నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, రూ.18 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

**చందుర్తి ( జనం సాక్షి ):** పోలీసుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా సైబర్ నిందుతులను చందుర్తి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితులు గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ సెంటర్లు, మనీ ట్రాన్స్ ఫర్ సెంటర్ల ఫోన్ నెంబర్లను సేకరించి పోలీస్ అధికారులుగా పరిచయం చేసుకొని భాదితుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈసందర్భంగా డిఎస్పీ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన, ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేట్‌లోని అల్మాస్‌గూడలో నివాసం ఉంటున్న కిలుకాని సాయిచంద్ (30) సూర్యాపేటకు చెందిన వ్యక్తిగా, ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేట్‌లో నివాసం ఉంటున్న కట్కూరి శరత్ కుమార్ (31) అనే వ్యక్తులు మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్సాక్షన్ సెంటర్లకు సంబంధించిన ఫోన్ నంబర్లను గూగుల్, టెలిగ్రామ్ ద్వారా సేకరిస్తు అమాయక బాధితులకు ఫోన్ చేసి, తాము ఎఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి అనే పోలీస్ అధికారిగా పరిచయం చేసుకుని, పోలీస్ అధికారులకు అత్యవసరంగా హాస్పిటల్ ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయని, వెంటనే ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాలని నమ్మించే వారని,నిందితులు తమ నేరానికి అనుగుణంగా ముందుగానే ఒక పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి, తమ వాహనం లేదా బోర్ బండి రిపేర్‌కు వచ్చిందని, తమ సార్ డబ్బులు వారి ఫోన్ నంబర్‌కు పంపిస్తారని చెప్పి వారి నంబర్‌ను తీసుకుని,ఆ తర్వాత ఆ నంబర్‌ను మీసేవ నిర్వాహకులకు ఇచ్చి, బాధితుల నుంచి ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేయించేవారని, డబ్బులు బదిలీ అయిన అనంతరం నిందితులు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి నగదును తీసుకునేవారని తెలిపారు.

ఇందులో భాగంగా నిందితులు సాయిచంద్, శరత్ కుమార్‌లు చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ఎఎస్సై శ్రీనివాస్ రెడ్డిగా మాట్లాడుతున్నాడని పరిచయం చేసుకుని తన బాబు ప్రాణం బాగోలేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించారని అత్యవసరంగా రూ. 70 వేలు అవసరముందని, డబ్బులు పంపిస్తే హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత తిరిగి ఇస్తానని పెంటయ్యను నమ్మించగా, నిందితులు చెప్పిన మాటలను నిజమని నమ్మిన పెంటయ్య డబ్బులు పంపేందుకు సిద్ధం కాగా, నిందితులు హైదరాబాద్‌కు చెందిన ఒక పెట్రోల్ బంక్ ఫోన్ నంబర్‌ను అతనికి ఇచ్చారు. ఆ నంబర్‌కు రూ. 70 వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. డబ్బులు పంపిన అనంతరం నిందితులు తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన పెంటయ్య చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భాదితుని ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చందుర్తి సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, నిందితుల నుంచి నేరం ద్వారా సమకూరిన సొమ్ములో భాగంగా రూ. 18,000 నగదు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకొని రిమాండ్ కి తరలించారు.



## చలో దుబ్బాక మాల ఉపకులాల మహా ధర్నాను జయప్రదం చేయండి..

**జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపు..**

**తిమ్మాపూర్ మండల కేంద్రంలో సన్నాహక సమావేశం..**



**తిమ్మాపూర్,ఆగస్టు13 (జనంసాక్షి )** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మాలల జనాభాను తక్కువగా చూపుతూ,రోస్టర్ విధానం ద్వారా మాలలకు మరియు వారి ఉపకులాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని జాతీయ మాల మహానాడు నాయకులు మండిపడ్డారు.ఈ అన్యాయాలకు నిరసనగా ఈ నెల 23వ తారీఖున చేపట్టబోయే హలో మాల చలో దుబ్బాక మాల ఉపకులాల మహా ధర్నాను భారీ ఎత్తున విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు.కరీంనగర్ జిల్లా,తిమ్మాపూర్ మండలంలో ఓ సమావేశంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్,ర్యాకం శ్రీరాములు,రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ కాల్వ నరేష్,దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్,రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ ఎలుక దేవయ్య ముఖ్య అతిథులుగా ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఏబీసీడీ వర్గీకరణ ప్రస్తుత అశాస్త్రీయ రోస్టర్ విధానాల వల్ల మాలలు,వారి ఉపకులాలు ఉపాధి,విద్యా,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ రోస్టర్ విధానాన్ని పునః సమీక్షించాలని మాలల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోం అని హెచ్చరించారు.?హక్కుల సాధన కోసం మాలలందరూ ఐక్యంగా ఉద్యమించి,దుబ్బాకలో నిర్వహించే మహా ధర్నాలో వేలాదిగా తరలివచ్చి తమ నిరసన గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు.??ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ రాగుల నరసయ్య,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల శేఖర్ బాబు,దామర శంకర్,రాజ మహేందర్,మాశం బాబు,సంఘం మధు,రాకమ ఆంజనేయులు,రమేష్,సాయి,దొంతుల రాయమల్లు,తిరుపతి, చంద్రయ్య,లక్ష్మణ్,యాస బాబు,జతనం శంకర్ తదితరులు పాల్గొని ధర్నా జయప్రదానికి తమ మద్దతు తెలిపారు.

## అల్లిపూర్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే:



**రాయికల్ ఆగస్టు13 జనం సాక్షి:** రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో గురువారం రోజున ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు భూమిపూజ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న 3.50 మూడు లక్షల 50 వేల రూపాయలతో పరారీ గోడ మరియు ఐదు లక్షల రూపాయలతో కిచెన్ షెడ్ నిర్మాణం మరియు నాలుగు లక్షల రూపాయలతో మరుగుదొడ్డి నిర్మాణం మరియు నాలుగు లక్షల రూపాయలతో అంగన్వాడి భవన మరమ్మత్తు మరియు సిసిరోడ్డు కు భూమి పూజ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంభారీ గౌతమి వెంకటేష్, ఉపసర్పంచి వినయ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు గ్రామ యువత మండల పరిధిలోని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, మాజీ కో ఆప్షన్ మెంబర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**

**- స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్**



**పెద్దపల్లి,ఆగస్టు 13(జనంసాక్షి) :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లాలో వైభవంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు తెలిపారు.గురువారం అదనపు కలెక్టర్ బి శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చేస్తున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఏర్పాట్లను డీసీపీ రామ్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ,ఆగస్టు 15 న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథిగా హాజరు అవుతారని అన్నారు.స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందిగా పూర్తి చేయాలని అన్నారు. పెరేడ్ నిర్వహణ సంబంధించి చేస్తున్న రిహార్సల్స్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య,కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## యువశక్తితోనే దేశ ప్రగతి.. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**- వేలాది మంది విద్యార్థులతో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ**

**పెద్దపల్లి,ఆగస్టు 13(జనంసాక్షి) :**
యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు.విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గురువారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారీ జెండా ర్యాలీని ఆయన ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తిరంగా యాత్రలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని విద్యార్థులు కదం తొక్కగా,ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలు ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావాలను మరింతగా పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశం పట్ల ప్రేమ, సేవా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా భారత్ ఉందని, యువత ప్రతిభను సరైన మార్గంలో వినియోగించుకుంటే దేశం అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగుతుందని రాంచందర్‌రావు తెలిపారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు విద్యా రంగంలోనూ అనేక సంస్కరణలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు,యువత భవిష్యత్తుకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలు,యూనివర్సిటీలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందుపట్ల సునీల్‌రెడ్డి,బల్మూరి వనిత,మీస అర్జున్‌రావు,కందుల సంధ్యారాణి,చల్ల నారాయణరెడ్డి, పెంజర్ల రాకేష్,కావేటి రాజగోపాల్,ఊషణ అన్వేష్,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండించిన లిమాజీలి లిఎమ్మెల్యే దాసరిలి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి,ఆగస్టు 13(జనంసాక్షి) :**
కాల్వ శ్రీరాంపూర్ మండలం లో బిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారనీ పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు బయలుదేరిన ఆయనను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని కాంగ్రెస్ నాయకులు నిన్న రాత్రి ధ్వంసం చేసి, అదే పాత బ్రిడ్జికి కొత్త శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుడితో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.ఈ విషయాన్ని పరిశీలించేందుకు అక్కడికి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదని పేర్కొన్నారు.బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎటువంటి అన్యాయం జరిగినా పార్టీ అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్తకు నేను అండగా నిలుస్తాను" అని దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు.వారి వెంట మాజీ ఎంపీపీ సంపత్ యాదవ్, గర్రెపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన జూపల్లి సందీప్ రావు నాయకులు బోయిని రాజమల్లు, దొమ్మడి శ్రీనివాస్, జూకంటి అనిల్, సలేంద్ర రాములు,చంద్ర మొగిలి,రాజమల్లు,ఓదెల మండలం యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, తదితరులు ఉన్నారు.



### తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో నీట్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పెద్దపల్లి,ఆగస్టు 13(జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నీట్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాళేశ్వరం జోన్ ఆఫీసర్ శారద ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు పెద్దపల్లి జిల్లా డిసిఓ, మంథని ప్రిన్సిపల్ శ్రీనాథ్ గురువారం పేర్కొన్నారు. నీట్ 2027 ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు.బాలురు కోసం హైదరాబాద్ సిఓఈ పాఠశాల, బాలికల కోసం మహీంద్రా హిల్స్ సిఓఈ పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు బాలురు 100 మంది, బాలికలు 100 మంది చొప్పున మొత్తం 200 మందికి ఉచితంగా నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. 2026 విద్యా సంవత్సరంలో బైపిసి ఉత్తీర్ణులై, నీట్ 2026 ప్రవేశ పరీక్షకు హాజరైన ఎస్సీ, ఎస్టి, ఓబిసి,ఈ డబ్ల్యూ ఎస్ విద్యార్థులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చివరి తేదీ ఈ నెల 28 అని, దరఖాస్తు చేయడానికి ఎటువంటి ఫీజు అవసరం ఉండదని పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు టీజిఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్. తెలంగాణ. జిఓవి.ఇన్ వెబ్ సైట్ ను సందర్శించి నోటిఫికేషన్ లో పేర్కొన్న వివరాలు పరిశీలించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని సూచించారు.వెబ్ సైట్ లో. ఉన్నటువంటి అంశాలను నింపి,అన్ని ధ్రువపత్రాలను జతపరిచి,సమీప డిసిఓ కేంద్రంలో సమర్పించాలని తెలిపారు.

### మృతిని కుటుంబానికి చేయూత

**సుల్తానాబాద్,ఆగస్టు 13(జనంసాక్షి) :** మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన ముత్యాల రాజమోహన్ అకాల మృతి చెందడంతో వారి కుటుంబానికి గ్రామస్తులు ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం గ్రామస్తులు అందరూ కలిసి జమ చేసిన డబ్బులను బ్యాంకులో వేసి రాజు మోహన్ భార్య ఇద్దరు కుమార్తెలకు పిక్స్ డిపాజిట్ చేసిన పత్రాలను అందించి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎంపీయూపీఎస్ పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్

ఎలిగేడు,ఆగస్టు 13(జనంసాక్షి) : ఎంపీయూపీఎస్ పాఠశాలలో విద్యార్థుల రీడింగ్ స్కిల్స్‌పై సర్పంచ్ పరిశీలన చేశారు. ర్యాకల్ దేవ్ పల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ విద్యార్థుల నోట్‌బుక్స్, రీడింగ్ స్కిల్స్‌ను బుధవారం పరిశీలించారు.విద్యార్థుల చదవు సామర్థ్యాన్ని పెంచేందుకు సాయంత్రం వేళల్లో డ్రిల్లింగ్ నిర్వహిస్తే కఠిన పదాలను సులభంగా పలకగలరని ఉపాధ్యాయులకు సూచించారు.



# ఈనెల 17న మంత్రుల పర్యటన

**- సభాస్థలిని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,కౌన్సిలర్లు**

**సుల్తానాబాద్,ఆగస్టు 13 (జనంసాక్షి) :**



వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం ఈనెల 17న సుల్తానాబాద్ కు విచ్చేస్తున్న రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి,దుద్దిళ్ళ శ్రీధర్ బాబుల పర్యటన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి రమేష్ తో కలిసి పూసాల రోడ్డులో జరిగే సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుల్తానాబాద్ నుండి పెద్దాపూర్ వరకు రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. ఎక్కడ లేని విధంగా జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉట్ల వర ప్రదీప్, సిద్ధ తిరుపతి,చింతల రాజు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, గరిగే శ్రీనివాస్,ఈర్ల శేఖర్,కలువల ఓదెలు, అమీరిశెట్టితిరుపతి, నన్ను,కందునూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సబ్‌స్టేషన్ ను త్వరగా నిర్మించాలి -సర్పంచ్ మారం కొమురయ్య

ఎలిగేడు,ఆగస్టు 13(జనంసాక్షి) :



కరెంటు సబ్‌స్టేషన్ ను త్వరగా నిర్మించాలని సంబంధిత విద్యుత్ అధికారులను సర్పంచ్ మారం కొమురయ్య బుధవారం కోరారు.దూలికట్ట గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి కావలసిన భూమికి సంబంధించిన పత్రాలను సర్పంచ్ మారం కొమురయ్య అధికారికంగా కరెంటు డిపార్ట్మెంట్ అధికారులు ఏడి రామస్వామి, ఏఈ సంపత్ కుమార్ లకుఅప్పగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొమురయ్య మాట్లాడుతూ దూలికట్టలో నూతనంగా మంజూరైన కరెంటు సబ్‌స్టేషన్ ను త్వరగా నిర్మించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఏడి రామస్వామి,ఏఈ సంపత్ కుమార్,మాజీ సర్పంచ్ పరుశరాములు, పాలకవర్గ సభ్యులు కార్యదర్శి జ్యోతి, లైన్మెన్ భాస్కర్, రెవెన్యూ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కి వినతి

ఎలిగేడు,ఆగస్టు 13(జనంసాక్షి) :



పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యు ఎస్ పి సి ఆధ్వర్యంలో యుఎస్ పిసి నాయకులు ఎలిగేడు మండల కేంద్రంలోని తహసిల్దార్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపి అనంతరం తహసిల్దార్ కి మెమోరండం సమర్పించారు.వారు మాట్లాడుతూ రెండవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం తహసిల్దార్ కార్యాలయం ముందు పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్న విషయం వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు.పాఠశాల సమయాల్లో నిరంతర శిక్షణలు, బోధ నేతర పనులు, ఆన్లైన్ పనులతో టీచర్లను తరగతి గది బోధన నుండి దూరం చేస్తున్నారు.ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూసివేయడం, ప్రైవేట్ బడుల శంకుస్థాపనలు నిరాటంకంగా జరుగుతున్నవని, పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని 1/7/2023 నుంచి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను చెల్లించాలని, సర్వీస్ ఉద్యోగుల,పెన్షనర్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ కు ఆప్షన్ ఇవ్వాలని, సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరిద్ధరించాలని, జి ఓ 25 ను సవరించాలని, యాజమాన్య ఉపాధ్యాయులకు బదిలీల పదోన్నత షెడ్యూల్ ను వెంటనే విడుదల చేయాలని,స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కు ఏకీకృత సర్వీస్ నిబంధన రూపొందించాలని, ఈహెచ్ సిటి ని బలోపేతం చేయాలని,అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందేటట్లుగా చూడాలని, బి ఎడ్ అర్హతలు ఉన్న యస్ జిటి ఉపాధ్యాయులకు సీనియార్టీ ప్రకారం పిఎస్ హెచ్ఎం ప్రమోషన్ అవకాశం కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన మెమోరండంను తహసిల్దార్ కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ పిసి నాయకులు కె కుమార స్వామి,ఏ సంతోష్ రెడ్డి,పి వెంకటేశ్వర్ రెడ్డి,ఏ రాజేష్ కుమార్,జి దేవేందర్ రావు,వెంకటేశ్వర్లు, సంపత్,రాము ,స్రవంతి, శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.